



రుషికొండ ప్యాలెస్‌లో ఊడిన ఫాల్స్ సీలింగ్‌ను పరిశీలిస్తున్న ఉప ముఖ్యమంత్రి కె.పవన్‌కల్యాణ్. చిత్రంలో మంత్రి కందుల దుర్గేశ్ ఉన్నారు

నంబర్ వన్‌గా విశాఖ

టెక్నాలజీ హబ్‌గా నగరం

- పర్యాటకంగా మరింత అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తాం
- ఇక్కడకు వస్తే కొత్త ఉత్సాహం వస్తుంది
- ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు
- మహిళలకు సురక్షిత నగరంగా గుర్తింపు పొందడం ఏపీకి గర్వకారణం
- బీచ్‌రోడ్డులో డబుల్ డెక్కర్ బస్సుల ప్రారంభ కార్యక్రమంలో ముఖ్యమంత్రి



ఇండియా ఫుడ్ మాన్యుఫ్యాక్చరింగ్ సదస్సును జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

విశాఖపట్నం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): విశాఖ అంటేనే ప్రశాంతతకు మారుపేరని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కితాబునిచ్చారు. నగరవాసులంతా మంచిమనస్సు కలిగినవారన్నారు. ఒకవైపు సముద్రం...మరోవైపు కొండలు కలిగిన విశాఖ వస్తే తనకు కొత్త ఉత్సాహం వస్తుందన్నారు. భవిష్యత్తులో విశాఖను దేశంలోనే నంబర్‌వన్ నగరంగా అభివృద్ధి చేస్తానన్నారు. బీచ్‌రోడ్డులో డబుల్ డెక్కర్ బస్సులను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోనే మహిళలకు సురక్షిత నగరంగా విశాఖ గుర్తింపు పొందడం ఏపీకి గర్వకారణమన్నారు. నగరానికి బీచ్ పెద్ద అడ్వంటేజ్



డబుల్ డెక్కర్ బస్సులో నుంచి అభివాదం చేస్తున్న సీఎం

అని, దానిని సద్వినియోగం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పర్యాటకులను ఆకట్టుకునేందుకు వీలుగా బీచ్‌ను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. దీనివల్ల పర్యాటకం అభివృద్ధి చెంది అందరికీ మంచి జరుగుతుందన్నారు. డబుల్ డెక్కర్ బస్సు బీచ్‌రోడ్డులో ఉన్న 14 సందర్శనీయ ప్రాంతాలను కలుపుతుంది కాబట్టి పర్యాటకుల సంఖ్య కూడా పెరుగుతుందన్నారు.

భవిష్యత్తులో విశాఖ టెక్నాలజీ హబ్‌గా తయారుకాబోతోందని, ఇతర రాష్ట్రాలు, ప్రాంతాల నుంచి ఎంతో మంది నగరానికి వలసవచ్చే పరిస్థితి ఉంటుందని చంద్రబాబునాయుడు అన్నారు. విశాఖను రాజధాని చేస్తామని గత ప్రభుత్వం ప్రకటిస్తే...అవసరం లేదని ఆర్థిక రాజధానిగా అభివృద్ధి చేయాలంటూ నగరవాసులు తమ తీర్పును గత ఎన్నికల్లో ఇచ్చారని చంద్రబాబు అన్నారు. 2019 ఎన్నికల్లో రాష్ట్రంలో చాలాచోట్ల టీడీపీ ఓటమి పాలైనాసరే విశాఖ నగరంలోని అన్ని స్థానాల్లోనూ పార్టీ అభ్యర్థులను గెలిపించారన్నారు. అది పార్టీపై, తనపై నగరవాసులకు ఉన్న అభిమానానికి నిదర్శనమన్నారు. విశాఖను పర్యాటకంగా మరింత అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తామని సీఎం చంద్రబాబు వివరించారు.

సకాలంలో స్థానిక ఎన్నికలు

పాలకవర్గాల కాలపరిమితి ముగిసిన వెంటనే నిర్వహిస్తాం

- త్వరలో మిగిలిన నామినేటెడ్ పదవులు భర్తీ
- పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయండి
- నగర టీడీపీ నేతలతో మంత్రి లోకేశ్
- డిప్యూటీ మేయర్-2పై అవిశ్వాసం పెట్టాలని సూచన



ఏఐ ల్యాబ్‌ను పరిశీలిస్తున్న మంత్రి నారా లోకేశ్

విశాఖపట్నం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల పాలక వర్గాల కాలపరిమితి ముగిసిన వెంటనే ఎన్నికలు నిర్వహిస్తామని రాష్ట్ర ఐటీ, మానవ వనరుల అభివృద్ధి శాఖల మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. స్థానిక సంస్థల్లో విజయం సాధించడానికి ప్రజా ప్రతినిధులు, నాయకులు ఇప్పటి నుంచే ప్రణాళికలు అమలు చేయాలని, ప్రతి ఒక్కరూ తమ పరిధిలో ప్రజలు, పార్టీ శ్రేణులకు నిత్యం అందుబాటులో ఉండాలన్నారు. రెండు రోజుల నగర పర్యటనకు వచ్చిన ఆయన్ను శుక్రవారం ఉదయం జిల్లా ఇన్‌చార్జి మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, ఎంపీ ఎం.శ్రీభరత్, ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణబాబు, పి.గణబాబు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, పార్టీ పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షుడు గండి బాబ్జీ, విశాఖ దక్షిణ ఇన్‌చార్జి సీతంరాజు సుధాకర్ ... మిగతా 8వ పేజీలో

ప్రజల ఆకాంక్షలను గుర్తించండి


అందుకు అనుగుణంగా నడుచుకోండి



బే వ్యూ హోటల్‌లో నిర్వహించిన పార్లమెంటరీ నియోజకవర్గ సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

- నాయకులకు జనసేన అధినేత పవన్‌కల్యాణ్ దిశానిర్దేశం
- పార్టీ నిలదొక్కుకోవడానికి జన సైనికులు, వీర మహిళలే కారణం
- విశాఖ నగరంతో పార్టీకి విడదీయలేని అనుబంధం
- కూటమితో కలిసి ఉంటూనే పార్టీ బలోపేతం: ఎమ్మెల్యే సుందరపు
- రుషికొండ ప్యాలెస్‌పై త్వరగా నిర్ణయం తీసుకోవాలని పార్లమెంటరీ నియోజకవర్గాల కార్యకర్తల సమావేశంలో తీర్మానం
- నేడు ఇందిరాప్రియదర్శిని స్టేడియంలో క్రియాశీలక కార్యకర్తల సమావేశం

విశాఖపట్నం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ నిలదొక్కుకోవడానికి జన సైనికులు, వీర మహిళలే కారణమని అధినేత కె.పవన్‌కల్యాణ్ అన్నారు. శుక్రవారం బే వ్యూ హోటల్‌లో నిర్వహించిన పార్లమెంటరీ నియోజకవర్గ సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ ఓటమిని తాను అనేకసార్లు, అనేక విధాలుగా ఎదుర్కొన్నానన్నారు. అయితే జనసైనికులంతా



ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో ఏర్పాటు చేసిన సమావేశంలో పవన్ కల్యాణ్..

తనకు కష్టాల్లో అండగా నిలిచారని ప్రశంసించారు. తాను ఒక ఫ్రేమ్ వర్క్‌లోనే పనిచేస్తానని, ఏదైనా చేయాలని అనుకుంటే చేస్తానని, చేయకూడదని అనుకుంటే చేయబోనని స్పష్టంచేశారు. ఈరోజు జనసేన నుంచి 21 మంది ఎమ్మెల్యేలు గెలిచారంటే..కోట్లాది మంది జన సైనికుల వల్లనేనని అంతా గుర్తుంచుకోవాలన్నారు. వారందరికీ ఏమి కావాలో ... మిగతా 8వ పేజీలో

స్వర్ణ పంచాయతీ పోర్టల్‌తో బహుళ సేవలు

- రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ కమిషనర్ కృష్ణతేజ



కొత్తూరు పంచాయతీ కార్యాలయంలో పీఆర్ కమిషనర్ కృష్ణతేజ

కొత్తూరు (అనకాపల్లి), ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల్లో నిధుల దుర్వినియోగం, అక్రమాలను నిరోధించడానికి 'స్వర్ణ పంచాయతీ' పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకువచ్చామని రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ కమిషనర్ వి.ఆర్.కృష్ణ తేజ చెప్పారు. ఆయన శుక్రవారం అనకాపల్లి మండలం కొత్తూరు పంచాయతీని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలోని అన్ని పంచాయతీల కార్యకలాపాలు, సేవలు స్వర్ణ పంచాయతీ పోర్టల్ ద్వారానే జరుగుతాయని చెప్పారు. ఈ పోర్టల్‌లో ఎన్ని రకాల సేవలు అందుతున్నాయో ప్రజలు నేరుగా తెలుసుకోవచ్చన్నారు. ఈ పోర్టల్ అందుబాటులోకి వచ్చిన తరువాత పంచాయతీల ఆదాయం పెరిగిందని తెలిపారు. అనంతరం కొత్తగా నిర్మితమవుతున్న డీఎల్‌డీవో కార్యాలయ భవనాన్ని పరిశీలించారు. ఆయన వెంట జిల్లా పరిషత్ సీఈవో పి.నారాయణమూర్తి, డీపీవో ఇ.సందీప్, డీఎల్‌డీవో మంజులావాణి, ఎంపీడీవో దూలిపల్లి రాము, డిప్యూటీ ఎంపీడీవో ప్రసాద్, సర్పంచ్ సప్పారపు లక్ష్మిప్రసన్న, ఉపసర్పంచ్ శ్రీనివాస్, కార్యదర్శి సుభాశ్, తదితరులు వున్నారు.

'స్త్రీ శక్తి'కి కొత్తగా మూడు వేల బస్సులు అవసరం -8లో

ఇన్‌చార్జిల పాలనలో దేవదాయ శాఖ

మూడు గ్రేడుల్లో 13 ఈవో పోస్టులు

- ప్రస్తుతం ఉన్నది ఏడుగురే!
- ఆఫీస్ సబార్డినేట్, గుమస్తా పోస్టుల్లో భారీగా ఖాళీలు
- మొత్తం పోస్టులు 26.. ఇప్పుడున్నది ముచ్చటగా ముగ్గురు!
- ఆలయాలు, ఆస్తులపై కొరవడిన పర్యవేక్షణ



అపార్ట్‌మెంట్ ఫ్లాట్‌లో నడుస్తున్న దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయం

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

జిల్లా దేవదాయ శాఖను అధికారులు, సిబ్బంది కొరత వేధిస్తున్నది. అనకాపల్లి కేంద్రంగా కొత్త జిల్లా ఏర్పడి మూడేళ్లు దాటినప్పటికీ దేవదాయ శాఖలో పాలన గాడిన పడలేదు. కీలక పోస్టుల్లో ఇన్‌చార్జిలు వుండడంతో ఆలయాలపైన పర్యవేక్షణ కొరవడింది. ఆలయాలకు చెందిన భూములకు కౌలు సక్రమంగా వసూలు కావడం లేదు.



మునగపాకలో ఈవో లేని పర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామి ఆలయం

జిల్లాలో దేవదాయ శాఖ పరిధిలో 720 ఆలయాలు ఉన్నాయి. వీటిల్లో 118 ఆలయాలకు పండుగలు, పర్వదినాల సందర్భంలో భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుంది. మిగిలిన వాటిని గ్రూపు దేవాలయాల పరిధిలోకి చేర్చారు. జిల్లాలో పెద్ద సంఖ్యలో దేవాలయాలు ఉన్నప్పటికీ నంతమంది అధికారులు లేరు. గ్రేడ్-1 వీటి పర్యవేక్షణకు తగి ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్లు (ఈఓలు) ఒకరు, గ్రేడ్-2 ఈవోలు నలుగురు, గ్రేడ్-3 ఈవోలు ఎనిమిది మంది.. మొత్తం 13 మంది ఈవోలు వుండాలి. కానీ ప్రస్తుతం ఏడుగురు మాత్రమే ఉన్నారు. ఆరు ఈవో పోస్టులు మూడేళ్ల నుంచి ఖాళీగా ఉన్నాయి. ఒక అధికారి రెండు, మూడు ఆలయాలకు అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. పూర్తిస్థాయిలో అధికారులు లేకపోవడం వల్ల దేవదాయ శాఖలో పనులు ఆలస్యంగా జరుగుతున్నాయి. ఆలయ భూముల పర్యవేక్షణ, పరిరక్షణ తలకు మించిన భారంగా మారుతున్నది. పాయకరావుపేట, చోడవరం, కశింకోట గ్రూపు దేవాలయాలను ... మిగతా 8వ పేజీలో

కుంకుమ వర్ణంలో స్వయంభూ విఘ్నేశ్వరుడు

చోడవరం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక స్వయంభూ విఘ్నేశ్వరాలయంలో గణపతి నవరాత్రి ఉత్సవాల రెండవ రోజైన శుక్రవారం స్వయంభూ గణేశుడు కుంకుమ వర్ణంలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు కొడమంచిలి చలపతి పూజాధికాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో ఆయాలనికి వచ్చి స్వయంభూ విఘ్నేశ్వరుడిని దర్శించుకుని పూజలు చేశారు.



కుంకుమ వర్ణంలో భక్తులకు దర్శనమిస్తున్న స్వయంభూ విఘ్నేశ్వరుడు

విశాఖ రేంజ్‌లో పలువురు సీఐల బదిలీ

విశాఖపట్నం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): విశాఖ రేంజ్ వీఆర్‌లో ఉంటూ పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న పలువురు సీఐలకు పోలీసు స్టేషన్లు కేటాయిస్తూ డీఐజీ గోపీనాథ్ జట్టి ప్రొసీడింగ్స్ జారీచేశారు. ఇంకా పలువురు సీఐలకు స్థానచలం కలిగించారు. రేంజ్ వీఆర్‌లో ఉన్న ఆర్.నీలయ్యను పార్వతీపురం మన్యం జిల్లాకు, ఆర్.సత్యనారాయణరెడ్డిను విజయనగరం జిల్లాకు, లెంక భాస్కరరావును శ్రీకాకుళం జిల్లాకు బదిలీ చేశారు. రేంజ్ వీఆర్‌లో ఉన్న బి.రమణమూర్తిని పార్వతీపురం మన్యం జిల్లా డీఎస్ఆర్‌బీకి, ఎం.చంద్రశేఖర్‌ను విజయనగరం జిల్లా టాస్క్‌ఫోర్స్‌కు, ఇక్కడ పనిచేస్తున్న డి.బంగారుపాపను విశాఖ రేంజ్‌కు బదిలీ చేశారు. విజయనగరం జిల్లా వీఆర్‌లో ఉన్న బీవీ వెంకటేశ్వరరావును విశాఖ రేంజ్‌కు, విశాఖ రేంజ్‌లో ఉన్న ఎస్.రమేశ్‌ను విశాఖలోని సీపీఎస్‌పీకి, పార్వతీపురం మన్యం జిల్లాలో డీఎస్ఆర్‌బీలో ఉన్న పి.రంగనాథంను అదే జిల్లా రూరల్‌కు బదిలీచేసి అక్కడ ఉన్న ఎస్.గోవిందరావును రేంజ్ వీఆర్‌కు అటాచ్ చేశారు. విజయనగరం జిల్లా సోషల్ మీడియా సైబర్‌సెల్‌లో పనిచేస్తున్న బమ్మిడి శ్రీనివాసరావును అల్లూరి సీతారామరాజు జిల్లా కొయ్యూరు సీఐగా బదిలీచేసి, అక్కడ పనిచేస్తున్న పి.వెంకటరమణను అల్లూరి జిల్లా సోషల్ మీడియా సైబర్‌సెల్‌కు బదిలీ చేశారు.

రోడ్డు మధ్యలో కూరుకుపోయిన టిప్పర్ లారీ

- రావికమతం- తట్టబంద మార్గంలో ఏడు గంటలపాటు స్తంభించిన ట్రాఫిక్



దాసరయ్యపాలెం వద్ద రోడ్డు మధ్యలో కూరుకుపోయిన టిప్పర్ లారీ

రావికమతం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): రావికమతం- తట్టబంద మార్గంలో మరుపాక పంచాయతీ దాసరయ్యపాలెం వద్ద భారీ టిప్పర్ లారీ రోడ్డు మధ్యలో కూరుకుపోయింది. దీంతో సుమారు ఏడు గంటలపాటు ఈ మార్గంలో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. మరుపాకలోని ఒక క్వారీ నుంచి బండరాళ్ల లోడుతో వెళుతున్న టిప్పర్ లారీ శుక్రవారం తెల్లవారుజామున ఐదు గంటలకు దాసరయ్యపాలెం వద్ద రోడ్డు మధ్య కూరుకుపోయింది. ట్రాక్టర్ల సహాయంతో టిప్పర్ లారీని బయటకు తీసేందుకు శ్రమించినా ఫలితం లేకపోయింది. అనకాపల్లి నుంచి రావికమతం వచ్చే ఆర్టీసీ బస్సులను మరుపాక నుంచి వెనక్కు మళ్లించారు. రావికమతం ఎస్ఐ ఎం.రఘువర్మ వచ్చి అనకాపల్లి నుంచి భారీ ఎక్స్‌కవేటర్, క్రేన్లను రప్పించారు. చాలా సేపు శ్రమించిన తరువాత మధ్యాహ్నం 12 గంటలకు టిప్పర్ లారీని బయటకు తీశారు. పరిమితికి మించి బండరాళ్లను రవాణా చేస్తున్నందుకు ఓవర్ లోడ్ కింద టిప్పర్ లారీకి రూ.34,305 అపరాధ రుసుం విధించినట్టు ఎస్ఐ చెప్పారు.

కొనసాగిన డీఎస్సీ అర్హుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్

- రెండో రోజు 600 మంది ధ్రువపత్రాల పరిశీలన
- మిగిలిన అభ్యర్థులకు నేటి వరకు గడువు

విశాఖపట్నం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ ఫలితాల మేరకు కాల్ లెటర్లు వచ్చిన అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన రెండో రోజు శుక్రవారం కూడా కొనసాగింది. విశాఖ విమల విద్యాలయంలో నిర్వహించిన సర్టిఫికెట్ల పరిశీలనకు ... మిగతా 8వ పేజీలో

అనకాపల్లిలో నిలిచిన రాయగడ ఎక్స్‌ప్రెస్

- నాలుగు గంటలపాటు ఇబ్బంది పడిన ప్రయాణికులు



ప్లాట్‌ఫారంపై నిలిచి ఉన్న గుంటూరు- రాయగడ ఎక్స్‌ప్రెస్

అనకాపల్లి టౌన్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): విజయనగరం స్టేషన్ వద్ద శుక్రవారం ఉదయం గూడ్స్ రైలు పట్టాలు తప్పడంతో ఆ ప్రభావం గుంటూరు- రాయగడ ఎక్స్‌ప్రెస్‌పై పడింది. అనకాపల్లి రైల్వే స్టేషన్‌లో సుమారు నాలుగు గంటలపాటు నిలిచిపోయింది. దీంతో సకాలంలో గమ్యస్థానాలకు చేరలేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర అసహనం చెందారు. ఉదయం ఏడు గంటలకు అనకాపల్లి వచ్చిన గుంటూరు-రాయగడ ఎక్స్‌ప్రెస్ 11 గంటలకు ఇక్కడి నుంచి బయలుదేరింది. దువ్వాడ, విశాఖపట్నం వరకు వెళ్లాల్సిన ప్రయాణికులు ఇక్కడ రైలు దిగేసి, రోడ్డు మార్గంలో గమ్యస్థానాలకు బయలుదేరి వెళ్లారు. విజయనగరం, గజపతినగరం, బొబ్బిలి, పార్వతీపురం, రాయగడ వెళ్లే ప్రయాణికులు మాత్రం రైలులోనే వుండిపోయారు.

పల్లెల్లో సమస్యలు పరిష్కరించండి

▸ రాంబిల్లి మండల సమావేశంలో సభ్యులు విజ్ఞప్తి


సమావేశంలో సభ్యులనుద్దేశించి మాట్లాడుతున్న ఎంపీపీ శిరీష

రాంబిల్లి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో తాగు నీరు, పారిశుధ్యం తదితర సమస్యలు పరిష్కరించాలని పలువురు సభ్యులు కోరారు. ఎంపీపీ జి.శిరీష అధ్యక్షతన శుక్రవారం ఇక్కడి మండల పరిషత్ కార్యాలయంలో రాంబిల్లి మండల సర్వసభ్య సమావేశం ఏర్పాటైంది. తొలుత ఎంపీపీతో పాటు, జడ్పీటీసీ సభ్యుడు డి.నాగరాజు మాట్లాడుతూ అధికారులు, ప్రజా ప్రతినిధులు గ్రామాల్లో సమస్యలను సమష్టిగా పరిష్కరించుకోవాలని సూచించారు. అనంతరం పలువు సభ్యులు ఆయా గ్రామాల్లో సమస్యలను సభ దృష్టికి తీసుకువచ్చారు. ఖరీఫ్‌లో ఎరువులు అందుబాటులో ఉంచాలని, వ్యవసాయ సిబ్బంది రైతులకు తగిన సూచనలు, సలహాలు ఇవ్వాలని కోరారు. పలు గ్రామాల్లో తాగు నీరు, పారిశుధ్యం సమస్య పరిష్కరించాలని మరికొంత మంది సభ్యులు విన్నవించారు. పశువుల షెడ్లను పంచాయతీల్లో తీర్మానం చేసి పంపిన పాడి రైతులకు మంజూరు చేయకుండా అధికార పార్టీకి చెందిన వారికి ఇవ్వడం అన్యాయమని కొప్పుగొండుపాలెం సర్పంచ్ బి.హరి ఆరోపించారు. గ్రామాల్లో సొంత నిధులతో చేసిన అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులు మంజూరు చేయాలని పలువురు కోరారు. వీటిపై ఎంపీపీ, జడ్పీటీసీ మాట్లాడుతూ సభలో సభ్యులు లేవనెత్తిన అంశాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. తొలుత పది గంటలకు సమావేశం ప్రారంభం కావాల్సి ఉండగా, పదకొండు గంటలకు మొదలైంది. అప్పటికీ కొంతమంది అధికారులు హాజరు కాకపోవడంతో సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు రానప్పుడు ఇటువంటి సమావేశాలు ఎందుకని ప్రశ్నించారు. ఆ తరువాత అధికారులు ఒక్కొక్కరిగా రావడంతో సమావేశం ప్రారంభమైంది. ఎంపీడీవో జమాధవి, ఆర్‌ఐ రవికుమార్, మండల వ్యవసాయాధికారిణి సమంతతో పాటు వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

'మహిళలు స్వయం సమృద్ధి సాధించాలి'


అర్బన్ మార్కెట్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ ప్రసాదరాజు

ఎలమంచిలి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : బ్యాంకులు అందించే రుణాలను సద్వినియోగం చేసుకుని డ్వాక్రా మహిళలు స్వయం సమృద్ధి మునిసిపల్ కమిషనర్ ప్రసాదరాజు సూచించారు. పట్టణంలోని బ్యాంక్ ఆఫ్ బరోడా కార్యాలయం ఆవరణలో శుక్రవారం మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అర్బన్ మార్కెట్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా వికాసానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ఇందులో భాగంగా వివిధ పథకాలను ప్రవేశపెడుతున్నట్టు చెప్పారు. వాటిని అర్హులంతా సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు. అనంతరం వ్యాపారంలో మెలకువలను డ్వాక్రా మహిళలకు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో మెప్మా సీఎంఎం పద్మావతి, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

▸ వైద్య సిబ్బందికి డీఎంహెచ్‌వో డాక్టర్ హైమావతి ఆదేశం
▸ నాగులాపల్లి ఆరోగ్య కేంద్రం తనిఖీ
▸ ప్రజలంతా కాచి వడబోసిన నీటిని తాగాలని సూచన


నాగులాపల్లి ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బందితో సమావేశమైన డీఎంహెచ్‌వో డాక్టర్ హైమావతి

మునగపాక, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలను అప్రమత్తం చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిణి డాక్టర్ ఎం.హైమావతి సూచించారు. మండలంలోని నాగులాపల్లి గల ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం ఆమె తనిఖీ చేశారు. తొలుత రికార్డులను పరిశీలించి, రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. అనంతరం సిబ్బందితో సమావేశమయ్యారు. వర్షాలు పడుతున్నందున వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందన్నారు. సిబ్బంది అప్రమత్తంగా ఉండి ప్రజలకు అనారోగ్యం సోకితే వెంటనే అవసరమైన వైద్య సేవలందించాలని ఆదేశించారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇచ్చేలా చైతన్యం చేయాలన్నారు. గ్రామంలో దివ్యాంగ బాలిక ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకోవడంతో పాటు వారి ధ్రువపత్రాలను పరిశీలించారు. మందుల కొరత లేకుండా చూసుకోవాలన్నారు. ప్రస్తుత వాతావరణం దృష్ట్యా ప్రజలంతా కాచి వడబోసిన నీటిని తాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యుడు డాక్టర్ వినోద్‌కుమార్, హెల్త్ సూపర్‌వైజర్ ఎం.నాగేశ్వరరావుతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయంలో రెండు కంప్యూటర్లు చోరీ


ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ సావిత్రి

ఎలమంచిలి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక అగ్నిమాపక కాలనీలో ఉన్న వార్డు సచివాలయం-9లో రెండు కంప్యూటర్లు చోరీకి గురైనట్టు పట్టణ పోలీసులకు ఫిర్యాదు అందింది. దీంతో ఎస్‌ఐ కె.సావిత్రి వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బంది మాట్లాడుతూ, రోజూ మాదిరిగానే గురువారం సాయంత్రం విధులు ముగించుకుని తలుపులకు తాళాలు వేసి వెళ్లామని, శుక్రవారం ఉదయం విధులకు రాగా.. తలుపు సగం తీసి ఉందని చెప్పారు. లోపలికి వెళ్లి చూడగా రెండు కంప్యూటర్‌లు కనిపించలేదని, దీనిపై మునిసిపల్ కమిషనర్‌కు, పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. కాగా పోలీస్ సర్కిల్ కార్యాలయంతోపాటు, రూరల్ పోలీస్ స్టేషన్ ఎదుట ఉన్న ఈ వార్డు సచివాలయంలో కంప్యూటర్లు చోరీ జరగడం చర్చనీయాంశంగా మారింది.

గడ్డి ట్రాక్టర్ దగ్ధం

ఎలమంచిలి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : పట్టణ సమీపంలోని పెదపల్లి రోడ్డుపై శుక్రవారం గడ్డి ట్రాక్టర్‌లో ప్రమాదవశాత్తూ మంటలు వ్యాపించాయి. ఈ సమాచారం అందున్న అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. గడ్డి మొత్తం కాలిపోగా, ట్రాక్టర్ కొంత భాగం దెబ్బతింది. ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదు.

'మహిళల ద్వారా ఆర్గానిక్ ఉత్పత్తుల విక్రయమే లక్ష్యం'


బలరామునికి పూజలు చేస్తున్న ప్రతినిధులు

అచ్యుతాపురం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): కిసాన్ మహిళా మిత్ర ఆధ్వర్యంలో శుక్రవారం కొండకర్లలో బలరామ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఫ్‌పీవో డైరెక్టర్ కొల్లి సురేష్ మాట్లాడుతూ మండలంలో కిసాన్ మహిళా మిత్ర సంఘంలో ఇప్పటికి 328 మంది మహిళలు సభ్యులుగా ఉన్నారన్నారు. వీరందరికీ సబ్సిడీపై డ్రిప్ ఇరిగేషన్ పైపులు, టార్పాలిన్‌లు ఇచ్చి నట్టు చెప్పారు. మహిళల ద్వారా ఆరోగ్యకరమైన ఆర్గానిక్ ఉత్పత్తులు విక్రయాలు జరిపించడమే తమ ఉద్దేశ్యంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ గొంతిన భక్త సాయిరాం, ఆడారి రెడ్డి నాయుడు, పల్లి శేషగిరిరావు, శివ, తులసీ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో ఎరువులు : ఏవో

రాంబిల్లి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సాగుకు సంబంధించి రైతులకు అవసరమైన ఎరువులు ఐదు రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నట్టు మండల వ్యవసాయాధికారిణి సమంత శుక్రవారం విలేఖరులకు తెలిపారు. 36 టన్నుల యూరియా, 20 టన్నుల డీఏపీ ఎరువులను రైతుల కోసం సిద్ధంగా ఉంచామన్నారు. దిమిలి, మురకాడ, కట్టుబోలు, మామిడివాడ, గోకివాడ పంచాయతీల్లో గల రైతు సేవా కేంద్రాల్లో ఉన్నాయని, అర్హులైన వారంతా సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

ఘనంగా తెలుగు భాషా, జాతీయ క్రీడా దినోత్సవాలు


కొత్తపేట హైస్కూల్‌లో గిడుగు, ధ్యాన్‌చంద్ చిత్రపటాల వద్ద నివాళి

ఎలమంచిలి ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : తెలుగు భాషా, జాతీయ క్రీడా దినోత్సవాలను పలు పాఠశాలల్లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పట్టణం లోని కొత్తపేట జెడ్పీ హైస్కూల్, తులసీనగర్ బాలికోన్నత ప్లస్ పాఠశాలల్లో జరిగిన ఈ వేడుకల్లో ప్రధానోపాధ్యాయులు కె.సుశీల, వై.వి.రమణ, గిడుగు రామ్మూర్తి, ధ్యాన్‌చంద్‌ల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయిని సుశీల మాట్లాడుతూ తెలుగు భాషకు గిడుగు రామ్మూర్తి వన్నెతెచ్చారన్నారు. ఇటువంటి మహనీయులను విద్యార్థులు ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని సూచించారు. తెలుగు భాషను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని వివరించారు. అలాగే, బాలికోన్నత పాఠశాల విద్యార్థినులకు హాకీ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు ఈ కార్యక్ర మాల్లో పీఈటీలు కుందూరు రాజు, మూర్తిలతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అచ్యుతాపురంలో...


అచ్యుతాపురంలోని పాఠశాలలో సాంప్రదాయ దుస్తుల్లో విద్యార్థినులు


పాటిపల్లిలో గల ఏపీ మోడల్ పాఠశాలలో...

అచ్యుతాపురం : తెలుగు భాషా దినోత్సవాన్ని ఇక్కడి విశాఖ పబ్లిక్ స్కూల్‌లో ఘనంగా నిర్వహించారు. తెలుగు భాషాభివృద్ధికి గిడుగు రామ్మూర్తి చేసిన కృషిని కరస్పాండెంట్ గండిబోయిన అప్పల రాజు, ప్రిన్సిపాల్ బి.సుధ విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

పాటిపల్లిలో...

మునగపాక : పాటిపల్లి మోడల్ మోడల్ స్కూల్‌లో తెలుగుభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తెలుగుభాష ఔన్నత్యాన్ని ఉపాధ్యాయులు వివరించారు. తెలుగుభాషను కాపాడుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ శ్రీలక్ష్మి, కమిటీ చైర్మన్ భీశెట్టి జోగినాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే సొసైటీ లక్ష్యం

▸ నక్కపల్లి సొసైటీ చైర్‌పర్సన్ కొప్పిశెట్టి బుజ్జి


రైతులకు యూరియా పంపిణీ చేస్తున్న సొసైటీ చైర్‌పర్సన్ బుజ్జి

నక్కపల్లి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే ధ్యేయంగా సహకార సొసైటీలు పనిచేస్తాయని నక్కపల్లి పీఏసీఎస్ చైర్‌పర్సన్ కొప్పిశెట్టి బుజ్జి చెప్పారు. మండలంలోని ఉపమాక రైతు సేవా కేంద్రం వద్ద రైతులకు యూరియా పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా బుజ్జి మాట్లాడుతూ ఎరువులు, యూరియా కోసం రైతుల సమయం వృథా చేయకుండా సకాలంలోనే అందజేయాలని ప్రభుత్వం స్పష్టమైన మార్గదర్శకాలను జారీ చేసిందన్నారు. క్రిమిసంహారక మందుల మోతాదును తగ్గించి, సేంద్రియ పద్ధతుల్లో రైతులు వ్యవసాయం చేయాలన్నారు. లాభసాటి వ్యవసాయం కోసం వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలన్నారు. అవసరమైన వారికి తక్కువ వడ్డీతో రుణాలు ఇస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపమాక దేవస్థానం మాజీ చైర్మన్ కొప్పిశెట్టి కొండబాబు, సర్పంచ్ ప్రగడ వీరబాబు, సొసైటీ డైరెక్టర్ ఎం.కొండబాబు పాల్గొన్నారు.

ఉత్సాహంగా జాతీయ క్రీడా దినోత్సవం


జాతీయ క్రీడా దినోత్సవ ర్యాలీ చేస్తున్న దృశ్యం

నక్కపల్లి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బీఎస్ హాకీ మైదానంలో శుక్రవారం జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. హాకీ క్లబ్ కార్యదర్శి కొల్నాటి తాతాజీ, క్రీడాకారులంతా హాకీ పితామహుడు మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్‌చంద్ సేవలను క్రీడాకారులకు వివరించారు. అనంతరం నక్కపల్లిలో జాతీయ క్రీడా దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఇటీవల పలు హాకీ టోర్నమెంట్లలో విజయాలు సాధించిన క్రీడాకారులను హాకీ క్లబ్ వ్యవస్థాపకుడు బలిరెడ్డి సూరిబాబు, అధ్యక్షులు చిన్న అప్పారావు, సీనియర్ క్రీడాకారుడు రామచంద్రరావు, కోచ్ రాంబాబు తదితరులు అభినందించారు.

ఎస్.రాయవరంలో...

ఎస్.రాయవరం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దార్లపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం హెచ్‌ఎం జాన్ ఆధ్వర్యంలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా ఉపాధ్యాయులంతా ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వ్యాయామ ఉపాధ్యాయిని నిర్మల మాట్లాడుతూ క్రీడా స్ఫూర్తితో విద్యార్థులు నడుచుకోవడానికి జాతీయ క్రీడా దినోత్సవం ఒక అద్భుతమైన వేడుకన్నారు. అనంతరం పాఠశాలలో నిర్వహించిన క్రీడా పోటీలను హెచ్‌ఎం జాన్ జెండా ఊపి ప్రారంభించారు.

తేనె కంటే మధురం తెలుగు భాష

జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, వేదపండితుడు సత్యదేవ శర్మ



నక్కపల్లిలో సత్యదేవ శర్మను సత్కరిస్తున్న దృశ్యం... సంప్రదాయ వేషధారణలోపాయకరావుపేట విద్యార్థినులు

నక్కపల్లి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): తేనెకంటే తెలుగు భాష ఎంతో మధురమైనదని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, వేదపండితుడు శ్రీపాద సత్యదేవ శర్మ అన్నారు. మండలంలోని చినదొడ్డిగల్లు జడ్పీ హైస్కూల్‌లో శుక్రవారం గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి సందర్భంగా తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ తెలుగు భాష గొప్పతనం వివరించారు. విద్యార్థులు ఇతర భాషల్లో పరిజ్ఞానం సంపాదించుకున్నప్పటికీ, మాతృ భాషపై పట్టు సాధించాలని సూచించారు. అంతకుముందు గిడుగురామ్మూర్తి చిత్రపటానికి హెచ్‌ఎం జయశ్రీ, రవీంద్రనాథ్ ఠాగూర్ అంగ్ల క్లబ్ వ్యవస్థాపకుడు వై.వెంకటరమణ, వేంపాడు సొసైటీ చైర్‌పర్సన్ వెలగా శ్రీను పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సత్యదేవ శర్మను ఘనంగా సత్కరించారు.

పాయకరావుపేటలో...

పాయకరావుపేట/రూరల్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): తెలుగు భాషోద్యమ పితామహుడు గిడుగు వెంకటరామమూర్తి జయంతిని పురస్కరించుకుని శుక్రవారం తెలుగు భాషా దినోత్సవాన్ని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. అదే విధంగా విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గిడుగు చిత్రపటానికి హెచ్‌ఎం పి.జాన్‌ప్రసాద్ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మురళీకృష్ణ, రమేశ్ పాల్గొన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తెలుగు భాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ప్రిన్సిపాల్ కె.శైలజ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో అధ్యాపకులు దేవన్న పాల్గొన్నారు. పెదరాంభద్రపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గిడుగు చిత్రపటానికి హెచ్‌ఎం కోడి శ్రీనివాసరావు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు విద్యార్థులు కవులు, కవయిత్రుల వేషధారణలతో పాటు నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వై.శ్రీనివాస్, రెహమాన్, భావనారాయణ, గంగునాయుడు, నాగమణి పాల్గొన్నారు.

కోటవురట్లలో...

కోటవురట్ల, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు పాఠశాలల్లో తెలుగు భాషా దినోత్సవం ఘనంగా జరిగింది. కొడవటిపూడి జడ్పీహెచ్ పాఠశాల కమిటీ చైర్మన్ యలమంచిలి శ్రీను, హెచ్‌ఎం ఆర్.ప్రతాప్‌కుమార్ ఆధ్వర్యంలో గిడుగు చిత్రపటానికి పూలమాల నివాళులర్పించారు. పాఠశాల కమిటీ చైర్మన్ శ్రీను మాట్లాడుతూ గిడుగు రామూర్తి తెలుగు బాష ఊపిరి పోశారన్నారు. అలాగే జల్లూరు, కోటవురట్ల బాలురు, బాలికల ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో తెలుగు భాషా దినోత్సవం నిర్వహించారు.

ఎస్.రాయవరంలో...

ఎస్.రాయవరం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మవరం అగ్రహారం, పెదగుమ్ములూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. హెచ్‌ఎంలు ఎంఎస్‌ఎస్ ప్రశాంతి, సుధామాధురి పాఠశాలల ఉపాధ్యాయులతో కలిసి గిడుగు రామ్మూర్తి పంతుల చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పండితులు శేషగిరి తెలుగు భాష గొప్పతనం వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు లలితాంబ, భవాని, రజియా, కృష్ణవేణి, కరుణ, కుమారి, శ్రీనివాసరావు, రాజు, ప్రకాశ్ పాల్గొన్నారు.



కోటవురట్ల: కొడవటిపూడిలో వేడుకలను నిర్వహిస్తున్న దృశ్యం... ఎస్.రాయవరంలో పద్య పఠనాన్ని పరిశీలిస్తున్న దృశ్యం

అలరించిన పద్య పఠనం

నక్కపల్లి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): పెదబోదిగల్లం హైస్కూల్‌లో శుక్రవారం విద్యార్థులతో పద్య పఠనం నిర్వహించారు. హెచ్‌ఎం జయశ్రీ నేతృత్వంలో శిక్షణ పొందిన విద్యార్థులు తెలుగుభాషపై ఆలపించిన పద్యాలు విశేషంగా అలరించాయి. వేమన సుమతి వంటి శతక పద్యాలను పిల్లలు ఎంతో రాగయుక్తంగా ఆలపించారు. ప్రతీ విద్యార్థి నూరు పద్యాలు రాగయుక్తంగా, భావయుక్తంగా వచ్చేలా శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పెదగుమ్ములూరు ఆదర్శ పాఠశాల హెచ్‌ఎం చోడిశెట్టి సత్యనారాయణ, తెలుగు పండిట్ ఆచార్యులు, ఉపాధ్యాయులు ఫాల్గుణరావు, కుమారి, రమేశ్‌బాబు, నాగేశ్వరరావు, శ్రీదేవి పాల్గొన్నారు.

కోనాం నుంచి 200 క్యూసెక్కులు విడుదల


జలాశయం గేట్లు ద్వారా విడుదల అవుతున్న నీరు

చీడికాడ, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): కోనాం జలాశయం మెయిన్ గేట్లు, కాలువల ద్వారా 200 క్యూసెక్కుల వరద నీటిని బొడ్డేరు నదిలోకి శుక్రవారం విడుదల చేసినట్టు ఇరిగేషన్ శాఖ ఏఈఈ బీవీ సత్యనారాయణదొర తెలిపారు. జలా శయం గరిష్ఠ స్థాయి నీటిమట్టం 101.25 మీటర్లు కాగా, ప్రస్తుతం 99.60 మీటర్లు ఉందన్నారు. బొడ్డేరు నదీ పరివాహక ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తం చేయాలని రెవెన్యూ, పోలీస్ అధికారులకు సమాచారం అందజేశామన్నారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

బుచ్చెయ్యపేట, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): పి.భీమవరం గ్రామానికి చెందిన పి.కామేశ్ శుక్రవారం గడ్డి మందు తాగి ఆత్మాహత్యాయత్నానికి పాల్పడ్డాడు. పోలీసులు, బంధువుల కథనం ప్రకారం... ఓ వివాహితతో కామేశ్ ప్రేమాయణం సాగించాడు. ఇటీ వల ఇద్దరు ఇంటి నుంచి వెళ్లి పోయారు. విషయం తెలుసుకున్న కుటుంబీకులు తీసుకువచ్చారు. గ్రామ పెద్దల సమక్షంలో పంచాయితీ పెట్టి మందలించారు. ప్రేమ విఫలం కావడంతో కామేశ్ గడ్డి మందు తాగేశాడు. కుటుంబ సభ్యులు వైద్యం కోసం ఆసుపత్రికి చేర్చగా, చికిత్స పొందుతున్నాడు.

తాండవ నదిలో వినాయక విగ్రహాల నిమజ్జనానికి ఏర్పాట్లు

పాయకరావుపేట, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): తాండవ నదిలో వినాయక విగ్రహాల నిమజ్జనానికి తుని దోబీఘాట్ వద్ద అన్ని ఏర్పాట్లు చేసినట్టు తుని పట్టణ సీఐ గీతా రామకృష్ణ తెలిపారు. తునిలోని ఆర్‌అండ్‌బీ గెస్టు హౌస్ ఎదుట దోబీ ఘాట్ వద్ద తాండవ నదిలో వినాయక విగ్రహాల నిమజ్జనానికి క్రెయిన్ ఏర్పాటు చేశామన్నారు. పాయకరావుపేట పట్టణంతో పాటు గ్రామాల్లో ఈ ఏడాది వినాయక ఉత్సవాల నిర్వాహకులు విగ్రహాలకు తుని దోబీ ఘాట్ వద్ద తప్పించి మిగిలిన ఎక్కడా నిమజ్జనం చేయడానికి అనుమతి లేదని స్పష్టం చేశారు. అదే విధంగా నిమజ్జన సమయంలో తాండవ నదిలోకి దిగకూడదని తెలిపారు. విగ్రహ నిమజ్జనానికి వచ్చేవారికి డీజే సౌండ్‌కు అనుమతి లేదన్నారు. అలాగే మద్యం తాగి ఊరేగింపులో పాల్గొంటే కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు.

అర్హులందరికీ పింఛన్ల పంపిణీ

కోటవురట్ల, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): అనర్హుల పేరిట నోటీసులు అందుకున్న వారికి యథావిధిగా ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేస్తామని ఎంపీడీవో చంద్రశేఖర్ స్పష్టం చేశారు. శుక్రవారం విలేకర్లతో ఆయన మాట్లాడుతూ పింఛన్లు రద్దవుతాయనే ఆందోళన నేపథ్యంలో ప్రభుత్వం అర్థం చేసుకొని అప్పీల్ నిర్ణయం తేది వరకూ పింఛన్లు అందజేయాలని ఆదేశించినట్టు చెప్పారు. తాత్కాలిక దివ్యాంగ సర్టిఫికెట్ ఉన్నవారికి పింఛన్లు పంపిణీ చేస్తారన్నారు. నోటీసులు అందుకుని ఇప్పటివరకు అప్పీలు చేయని వారు తమ కార్యాలయానికి వచ్చి అప్పీల్ చేసుకోవాలని ఆయన సూచించారు.

అలరించిన పద్య పఠనం

నక్కపల్లి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదబోదిగల్లం ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులతో పద్య పఠనం నిర్వహించారు. హెచ్‌ఎం జయశ్రీ ఆధ్వర్యంలో తెలుగు పండిట్ ఆచార్యుల నేతృత్వంలో శిక్షణ పొందిన విద్యార్థులు తెలుగుభాషపై ఆలపించిన పద్యాలు విశేషంగా అలరించాయి. వేమన సుమతి వంటి శతక పద్యాలను పిల్లలు ఎంతో రాగయుక్తంగా ఆలపించారు. ప్రతీ విద్యార్థి నూరు పద్యాలు రాగయుక్తంగా, భావయుక్తంగా వచ్చేలా శిక్షణ ఇస్తున్నామని ఆచార్యులు చెప్పారు. అంతకుముందు తెలుగుభాషా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెదగుమ్ములూరు ఆదర్శ పాఠశాల హెచ్‌ఎం చోడిశెట్టి సత్యనారాయణ, ఉపాధ్యాయులు ఫాల్గుణరావు, రమేశ్ బాబు, కుమారి, నాగేశ్వరరావు, శ్రీదేవి పాల్గొన్నారు.

'అన్నదాత సంక్షేమానికి ప్రధాని కృషి'

ఎస్.రాయవరం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): అన్నదాత సంక్షేమానికి ప్రధానమంత్రి మోదీ కృషి చేస్తున్నారని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాకలపాటి రవిరాజు అన్నారు. ఇందులో భాగంగానే రాష్ట్రంలోని అన్నదాతలకు ప్రస్తుతం 10,350 మెట్రిక్ టన్నుల యూరియాను, సెప్టెంబరు మొదటి వారంలో మరో 30 వేల మెట్రిక్ టన్నుల యూరియాను దిగుమతి చేసుకొనేందుకు అవకాశం కల్పించినట్టు చెప్పారు. యూరియా వ్యవసాయేతర అవసరాల కోసం యూరియాను రైతులు దారి మళ్లించొద్దని హెచ్చరించారు. సంబంధిత అధికారులు స్పందించి కట్టడి చేయాలని రవిరాజు సూచించారు.


కశింకోట పాఠశాలలో గిడుగు చిత్రపటం వద్ద ఉపాధ్యాయుల నివాళి


సబ్బవరం హైస్కూల్‌లో...


అనకాపల్లి మండలం మామిడిపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలలో...


కొత్తూరు ఏఎంఏఎల్ కళాశాలలో...

తెలుగు ఔన్నత్యానికి.. క్రీడా వైభవానికి జేజేలు

▸ ఘనంగా తెలుగు భాషా, జాతీయ క్రీడా దినోత్సవాలు ▸ గిడుగు రామ్మూర్తి వ్యవహారిక భాషా గొప్పతనాన్ని కీర్తించిన వక్తలు ▸ క్రీడా రంగంలో పతకాలు సాధించిన వారికి అతిథులు ప్రశంసలు

అనకాపల్లి కలెక్టరేట్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): తెలుగు భాష సంస్కర్తల్లో గిడుగు రామమూర్తి అగ్రగణ్యులు అని కలెక్టర్ విజయకృష్ణన్ పేర్కొన్నారు. గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి సందర్భంగా శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, తెలుగు భాషకు గిడుగు రామ్మూర్తి చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. మాతృ భాషను మరువకూడదని, తెలుగు సాహిత్యాన్ని సరళీకరించి తెలుగుభాష తీయదనాన్ని సామాన్యుడికి చేరువ చేసి తెలుగుభాష సంస్కర్తల్లో రామ్మూర్తి అగ్రగణ్యులుగా నిలిచారన్నారు. జేసీ జాహ్నవి, డీఆర్‌వో వై.సత్య నారాయణరావు, కలెక్టరేట్ ఏవో విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

అనకాపల్లి టౌన్ : ఒలింపిక్స్‌లో భారత్‌కు హాకీ క్రీడలో వరుసగా మూడు సార్లు బంగారు పతకాలు సాధించి పెట్టిన ఘనత మేజర్ ధ్యాన్‌చంద్‌దే అని టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ అన్నారు. ధ్యాన్ చంద్ జయంతిని పురస్కరించుకొని జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఇక్కడ 'నారా లోకేశ్ క్రీడా యువ కిరణాలు' పేరిట అనకాపల్లి జిల్లా జాతీయ క్రీడాకారుల అభినందన సభను నిర్వహించారు. నేషనల్ బాడీ బిల్డర్ శిలపరశెట్టి బాబి ఆధ్వర్యంలో ఏర్పాటైన ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. అనంతరం జాతీయస్థాయిలో ప్రతిభ చూపిన పలువురు క్రీడాకారులను రత్నాకర్ సన్మానించారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా ఖోఖో అసోసియేషన్ అధ్యక్షుడు దాడి జయవీర్, నారాయణ రావు, నేషనల్ పవర్ లిఫ్టర్ సూర్యనారాయణ, కొణతాల అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు. తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా ఇక్కడి మెయిన్ రోడ్డులో వన్‌వే ట్రాఫిక్ జంక్షన్ వద్ద గల తెలుగుతల్లి విగ్రహానికి సిద్ధార్థ సోషల్ సర్వీసెస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు బల్లా నాగభూషణం పూలమాల వేసి జేజేలు పలికారు. ఈ కార్యక్రమంలో వినకోట నీలేష్‌గుప్తా, రొబ్బి మల్లేశ్వరరావు, కె.రామారావు తదితరులు పాల్గొన్నారు. అలాగే, డైట్ ఇంజనీరింగ్ కళాశాలలో క్రీడా దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఆర్.వైకుంఠరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.



గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్..., జాతీయ క్రీడాకారుల అభినందన సభలో రత్నాకర్ తదితరులు

ఏఎంఏఎల్ కళాశాలలో...

కొత్తూరు : ఏఎంఏఎల్ కళాశాలలో నేషనల్ స్పోర్ట్స్ డేను నిర్వహించారు. కళాశాల గవర్నింగ్ బాడీ అధ్యక్షుడు కృష్ణపేర్రాజు, కరస్పాండెంట్ పెంటకోట వెంకటరామారావు, ప్రిన్సిపాల్ డాక్టర్ జి.జయబాబు ధ్యాన్‌చంద్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గవర్నింగ్ బాడీ సభ్యులు వాసిరెడ్డి బాలకృష్ణ, ఉదగిరి కృష్ణకిషోర్, రవీంద్ర, నిరంజన్‌కుమార్, సూపరింటెండెంట్ పెంటకోట అనురాధ పాల్గొన్నారు.

మామిడిపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలలో...

తుమ్మపాల : మామిడిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు భాష, క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు హెచ్‌బీ శ్రీధర్ మాట్లాడుతూ తెలుగు భాష గొప్పతనాన్ని విద్యార్థులంతా గుర్తించాలన్నారు. అలాగే ప్రతి ఒక్కరూ క్రీడలపై ఆసక్తిని పెంచుకోవాలని సూచించారు. ఉపాధ్యాయులు బాబు, గొంది చినబ్బాయి, నాగమణి, ఈశ్వరబాబు, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

తాళ్లపాలెం పాఠశాలలో...

కశింకోట : మండలంలోని తాళ్లపాలెం గాయిత్రి పాఠశాలలో మాతృ భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి హెచ్‌ఎం వై.నగేష్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులు సాంప్రదాయ దుస్తుల్లో సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. వ్యాసరచన, శ్లోకాలు, పద్యాల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లంకెలపాలెం ఉన్నత పాఠశాలలో...

లంకెలపాలెం : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం తెలుగుభాషా, జాతీయ క్రీడా దినోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు రౌతు నాగేశ్వరరావు గిడుగు వెంకటరామ్మూర్తి, హాకీ క్రీడా దిగ్గజం మేజర్ ధ్యాన్‌చంద్ చిత్ర పటాలకు పూల మాలలు వేశారు. తెలుగు భాష గొప్పతనాన్ని వివరించారు. విద్యార్థులకు వివిధ ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సబ్బవరం హైస్కూల్‌లో...

సబ్బవరం : మండల కేంద్రం సబ్బవరంలోని ప్రభుత్వ హైస్కూల్‌లో తెలుగు భాషా, జాతీయ క్రీడా దినోత్సవాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గిడుగు వెంకట రామ్మూర్తి, ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు ఎంఈవోలు లక్ష్మణరావు, రవీంద్రబాబు, హెచ్‌ఎం ఎస్.తిరుపతిరావు, ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎంఈవోలు మాట్లాడుతూ తెలుగు భాషాభివృద్ధికి గిడుగు చేసిన కృషిని వివరించారు. విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. అదే విధంగా స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ జి.శంకర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో ఇన్‌చార్జ్ హెచ్‌ఎం ఆర్.ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొని తెలుగు భాష గొప్పతనాన్ని విద్యార్థులకు వివరించారు.

జిల్లా పోలీస్ కార్యాలయంలో వెల్ఫేర్ డే


సిబ్బంది నుంచి సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ తుహిన్ సిన్హా

అనకాపల్లి రూరల్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం పోలీస్ వెల్ఫేర్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్పీ తుహిన్‌సిన్హా సిబ్బందితో వ్యక్తిగతంగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు చేపడతానని వారికి వివరించారు. సిబ్బంది సంక్షేమమే లక్ష్యంగా ఇటువంటి కార్యక్రమాలను కొనసాగిస్తామని తెలిపారు.

'ఆర్టీసీ ఎంప్లాయిూస్' జిల్లా కమిటీ ఎన్నిక

అనకాపల్లి టౌన్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ ఎంప్లాయిూస్ యూనియన్ జిల్లా నూతన కమిటీ శుక్రవారం ఇక్కడ ఎన్నికైంది. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వైవీఎస్ కుమార్, అధ్యక్షుడిగా డీఎస్‌మూర్తి, కార్యదర్శిగా డీఎల్ రాజు, కోశాధికారిగా ఐఎస్ బాబుతో పాటు మరో ఐదుగురిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు ఆధ్వర్యంలో ఈ ఎన్నిక నిర్వహించారు.


ఎన్నికైన యూనియన్ ప్రతినిధులు

వినాయక మండపాల వద్ద విద్యుత్ భద్రత పాటించాలి

కొత్తూరు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : వినాయక చవితి మండపాల వద్ద విద్యుత్ ప్రమాదాలు జరగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని అనకాపల్లి సర్కిల్ ఎస్ఈ జి.ప్రసాద్ శుక్రవారం సదరు సిబ్బందికి సూచించారు. మండపాలకు తాత్కాలిక విద్యుత్ సరఫరాకు అధికారిక కనెక్షన్లు మాత్రమే తీసుకోవాలన్నారు. లైసెన్సు ఉన్న ఎలక్ట్రీషియన్లు లేదా నిపుణుల ద్వారా పనులు చేయించాలని సూచించారు. ఫ్యూజ్ అండ్ సేఫ్టీ పరికరాలు తగిన సామర్థ్యం ఉన్నవాటిని మాత్రమే వాడాలన్నారు. వైరింగ్, ఇన్సులేషన్ ఐఎస్ఐ ప్రమాణాలు ఉన్న వైర్లు మాత్రమే వాడాలని, తెగిన వైర్లు, సడలిన జాయింట్లు వాడకూడదని సూచించారు. అత్యవసర సమయంలో ఏపీఈపీడీసీఎల్ హెల్ప్ లైన్ నంబరు 1912ను సంప్రదించాల్సిందిగా కోరారు.

భూ వివాదంలో వెన్నెలపాలెం సర్పంచ్‌పై క్రిమినల్ కేసు

▸ మరో ఆరుగురిపైనా నమోదు

పరవాడ, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): అధికారాన్ని అడ్డు పెట్టుకుని ఓ వ్యక్తి నుంచి అడ్డదారిలో భూమిని చేజిక్కించుకునేందుకు ప్రయత్నించిన ఏడుగురిపై కోర్టు ఆదేశాల మేరకు పోలీసులు క్రిమినల్ కేసులు నమోదు చేశారు. వీరిలో వైసీపీకి చెందిన వెన్నెలపాలెం పంచాయతీ సర్పంచ్ కూడా వుండడం విశేషం. దీనికి సంబంధించి వివరాలిలా ఉన్నాయి. మండలంలోని వెన్నెలపాలెం గ్రామానికి చెందిన కోండ్రు (కూండ్రపు) దేముడు 2023వ సంవత్సరం సెప్టెంబరు 16వ తేదీ సాయంత్రం పొలానికి వెళుతుండగా, అదే గ్రామానికి చెందిన వెన్నెల అప్పలనాయుడు, వెన్నెల దినేశ్, వెన్నెల అప్పారావు (సర్పంచ్), వెన్నెల సింహాద్రి, పైలా సన్యాసిరావు, వెన్నెల మహేశ్, పైలా సత్యనారాయణ అడ్డగించారు. ఖాళీ స్టాంప్ పేపరు, తెల్లకాగితాలపై సంతకాలు చేయాలని, లేకపోతే చంపుతామని బెదిరించారు. వారి బారి నుంచి తప్పించుకున్న దేముడు.. పోలీసు స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. కానీ సర్పంచ్‌పై ఫిర్యాదు కావడంతో రాజకీయ కారణాలతో అప్పటి పోలీసులు కేసు నమోదు చేయలేదు. దీంతో బాధితుడు అదే నెల 29వ తేదీన జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశారు. అయినా కేసు నమోదు చేయకపోవడంతో అనకాపల్లి 11వ అదనపు చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టులో కేసు దాఖలు చేశారు. వెన్నెల అప్పలనాయుడు, వెన్నెల దినేశ్ కుటుంబాలకు, తనకు మధ్య భూ వివాదానికి సంబంధించి కోర్టులో కేసు నడుస్తున్నదని, దీంతో తనపై కక్షగట్టి బలవంతంగా సంతకాలు చేయించుకునేందుకు ప్రయత్నం చేశారని కోర్టుకు నివేదించారు. వాదోపవాదాల అనంతరం సర్పంచ్‌తోసహా ఏడుగురిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని అనకాపల్లి 11వ అదనపు చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఈ నెల 25న పరవాడ పోలీసులను ఆదేశించారు. దీంతో పోలీసులు పలు సెక్షన్ల కింద క్రిమినల్ కేసులు నమోదు చేశారు.

వాహన మిత్ర పథకం అమలు చేయాలి

▸ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పడాల

అనకాపల్లి టౌన్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : వాహన మిత్ర పథకాన్ని అమలు చేయకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని ఆంధ్రప్రదేశ్ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పడాల గోవింద్ స్పష్టం చేశారు. ఎన్టీఆర్ స్టేడియంలో శుక్రవారం జరిగిన ఫెడరేషన్ అనకాపల్లి జిల్లా సమావేశంలో మాట్లాడారు. ఆటో డ్రైవర్ల సమస్యలను తక్షణమే పరిష్కరించాలన్నారు. డ్రైవర్లకు ప్రమాదకరంగా మారిన జీవో 21, 31లను రద్దు చేయాలని, పీఎఫ్, ఈఎస్ఐతో కూడిన సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని, ఆటోలకు పార్కింగ్ స్థలాలు కేటాయించాలని, అక్రమ కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ ఆటో డ్రైవర్లతో కలిసి నిరసన తెలియజేశారు. అనంతరం ఫెడరేషన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షునిగా కోన లక్ష్మణ, అధ్యక్షులుగా పెద్దిరెడ్డి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా మార్కండేయులు, అంజికుమార్ ఎన్నికయ్యారు. అలాగే, ప్రధాన కార్యదర్శిగా కోరిబిల్లి జగదీష్, సహాయ కార్యదర్శిగా సూరిశెట్టి బాపునాయుడు, కోశాధికారిగా కె.నాగరాజు, సభ్యులుగా అన్నం రమణ, పెంటకోట రాము, అప్పలరాజు, మోసూరు చిన్న, మాణిక్యం తదితరులు ఎన్నికయ్యారు.


ఎన్టీఆర్ స్టేడియంలో నిరసన తెలియజేస్తున్న ఆటో కార్మికులు

ఆర్ఈసీఎస్‌లో ఆ ఐదు కోట్ల నిధులు ఏమయ్యాయి?

▸ ఏ ఖాతాలోకి జమయ్యాయో బహిర్గతం చేయాలని ▸ వినియోగదారులు వియ్యపు శ్రీనివాస్‌యాదవ్, మద్దాల కృష్ణ డిమాండ్

కశింకోట, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి గ్రామీణ విద్యుత్ సహకార సంస్థ (ఆర్ఈసీఎస్) పరిధిలో సెప్టెంబరు 21వ తేదీ 2022కు ముందు నుంచి ఇన్‌కంటాక్స్ రూపేణా చెల్లించిన మినహాయింపు సొమ్ము ఏయే ఖాతాల్లో జమయ్యాయో ఆర్టీఐ ద్వారా తెలియజేయాలని వినియోగదారులు వియ్యపు శ్రీనివాస్ యాదవ్, మద్దాల కృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ఆర్ఈసీఎస్ నుంచి ఏటా ఇన్‌కంటాక్స్‌కు కొంత మొత్తాన్ని కట్టాల్సి ఉంటుందని వారు వివరించారు. సెప్టెంబరు 21, 2022 ముందు నుంచి చెల్లించిన ఇన్‌కంటాక్స్ మినహాయింపు ద్వారా రూ.12 కోట్లు వచ్చినట్టుగా తెలియడంతో ఆ వివరాలు తెలుసుకునేందుకు సమాచార హక్కు చట్టం ద్వారా దరఖాస్తు చేసుకున్నామని పేర్కొన్నారు. అందుకు సమాధానంగా ఇన్‌కంటాక్స్ డిపార్టుమెంటు నుంచి మినహాయింపు రూపేణా మొత్తం రూ.5,45,85,826 కోట్లు వచ్చినట్టు గత ఏడాది సెప్టెంబరులో సమాచార హక్కు చట్టం ద్వారా తెలియజేశారని వివరించారు. ఆ తరువాత మినహాయింపు ద్వారా వచ్చిన రూ.5,45,85,826 ఎవరి ఖాతాలో జమయ్యాయని ఈ ఏడాది జూలై ఏడో తేదీన మళ్లీ సమాచారం హక్కు చట్టం ద్వారా దరఖాస్తు చేయగా అటువంటి సమాచారం ఇవ్వకూడదని కేరళ హైకోర్టు తీర్పు ఇచ్చిందని సమాధానం ఇచ్చారని వారు తెలిపారన్నారు. ఏది ఏమైనా ఆర్ఈసీఎస్‌కు, వినియోగదారులకు చెందాల్సిన నిధులు ఏ ఖాతాలోకి జమ అయ్యాయో ఉన్నతాధికారులు నిగ్గుతేల్చాలని వారు కోరారు.

సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు పత్రాలు అందజేత


ఏఎస్‌పేటలో మంజూరు పత్రాలు అందజేస్తున్న పీలా గోవింద

కశింకోట, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యానికి గురైన పలువురు పేదలకు శుక్రవారం ముఖ్యమంత్రి సహాయ నిధి మంజూరు పత్రాలను పలు గ్రామాల్లో మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ అందజేశారు. కన్నూరుపాలెం, అడ్డాం, తాళ్లపాలెం, ఏఎస్‌పేట, జమాదులపాలెం, ఉగ్గినపాలెం, కొత్తపల్లి బుచ్చెయ్యపేట గ్రామాల్లో 27 మంది ఇళ్లకు వెళ్లి ఈ పత్రాలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల ఆరోగ్య పరిరక్షణకు కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు వేగి గోపీ, సిదిరెడ్డి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని పట్ల అసభ్యంగా ప్రవర్తించిన లెక్చరర్‌కు రిమాండ్

పరవాడ, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థినిపట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన కేసులో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల కెమిస్ట్రీ లెక్చరర్ గుత్తల శ్రీధర్‌కు రెండు వారాలపాటు రిమాండ్ విధిస్తూ న్యాయమూర్తి ఆదేశాలు జారీ చేశారు. లెక్చరర్ శ్రీధర్ ఈ నెల 23వ తేదీన ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఓ విద్యార్థిని పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన సంగతి తెలిసిందే. ఈ సంఘటనపై అందిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేశారు. అనంతరం విచారణ జరిపిన పోలీసులు.. లెక్చరర్ శ్రీధర్, సదరు విద్యార్థినిని ల్యాబ్‌కు పిలిపించి లైంగిక వేధింపులకు పాల్పడినట్టు తేలింది. శ్రీధర్‌ను శుక్రవారం అనకాపల్లి కోర్టులో హాజరుపరచగా వచ్చే నెల 12వ తేదీ వరకు రిమాండ్ విధిస్తూ న్యాయమూర్తి ఆదేశాలు జారీ చేసినట్టు సీఐ మల్లికార్జునరావు తెలిపారు. నిందితుడిని అనకాపల్లి సబ్ జైలుకు తరలించినట్టు ఆయన చెప్పారు.

విద్యార్థులకు టై, గుర్తింపు కార్డులు పంపిణీ


టై, గుర్తింపు కార్డులు అందుకున్న విద్యార్థులతో ఎంఈవోలు

సబ్బవరం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు టై, గుర్తింపు కార్డుల పంపిణీ కార్యక్రమం మండలంలోని గొటివాడ ప్రాథమిక పాఠశాలలో ప్రారంభమైంది. ఎంఈవోలు లక్ష్మణరావు, రాజేంద్రబాబు వీటిని విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ బడులను తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఇందులో భాగంగానే వివిధ పథకాల ద్వారా సౌకర్యాలు కల్పిస్తున్నట్టు చెప్పారు. వీటిని విద్యార్థులంతా సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ బొండా శేషుకుమారి, ఉప సర్పంచ్ విరోతి దుర్గా ప్రసాద్, హెచ్‌ఎం వీవీ ఆనంద్, ఉపాధ్యాయిని లక్ష్మి, స్కూల్ కమిటీ చైర్మన్ జి.నూకరాజు పాల్గొన్నారు.

వినాయక మండపంలో ప్రత్యేక పూజలు


పూజల్లో పాల్గొన్న టీడీపీ నాయకులు

తుమ్మపాల, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : వినాయక నవరాత్రి ఉత్సవాలు తుమ్మపాల పంచాయతీ పరిధిలో ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ఇక్కడ ఏర్పాటు చేసిన మండపంలో శుక్రవారం టీడీపీ నాయకులు సామూహిక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ మండల అధ్యక్షుడు కర్రి బాబీతో పాటు నాయకులు నడిపల్లి బోసుబాబు, నడిపల్లి గణేశ్వరరావు, పల్లెల గణేష్, గొంతిన శ్రీనివాసరావు, మార్టూరు అజయ్, బుదిరెడ్డి నరసింగరావు తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు. అలాగే పంచాయతీలోని పలు చోట్ల ఏర్పాటు చేసిన మండపాల్లో హోమాలు, పూజలు జరుపుతున్నారు. పలుచోట్ల మధ్యాహ్నం అన్నసమారాధనలు జరిపారు. ఈ వేడుకల సందర్భంగా ఆయా ప్రాంతాలు కోలాహలంగా మారాయి. నిర్వాహకులు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

లక్ష్మీగణపతి ఆలయంలో కలశ పూజ


పూజలో పాల్గొన్న సంస్థ ఎండీ కుమరేషన్ రాజేంద్రన్

పరవాడ, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : ఫార్మాసిటీలోని ఎస్ఎన్ఎఫ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమలో గల లక్ష్మీగణపతి ఆలయంలో శుక్రవారం భక్తిశ్రద్ధలతో కలశ పూజ నిర్వహించారు. పరిశ్రమ మేనేజింగ్ డైరెక్టర్ కుమరేషన్ రాజేంద్రన్ వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ కలశాన్ని ప్రతిష్ఠించారు. పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు, ఎంఎస్ఆర్‌ఎం, రాంకీ సీఈటీపీ, ఐటీసీఎల్ ప్రతినిధులు, ఎస్ఎన్ఎఫ్ ఇండియా పరిశ్రమ ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

శారదా బ్రిడ్జిపై గోతులు పూడ్చివేత


వంతెనపై గోతులు పూడ్చివేయిస్తున్న ఈశ్వరరావు

కొత్తూరు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : స్థానిక శారదా నది బ్రిడ్జిపై ప్రధాన రహదారి గోతులమయంగా మారడంతో తరచూ ప్రమాదాలు జరుగుతుండేవి. ఇది గుర్తించిన ఇక్కడి శారదానగర్‌కు చెందిన జ్యోసుల వెంకట ఈశ్వరరావు స్పందించి తన సొంత నిధులను వెచ్చించి సిమెంటు, ఇసుక, పిక్కతో ఆయా గోతులను శుక్రవారం పూడ్చించే చర్యలు చేపట్టారు.

ఆర్టీసీ బస్సులో సమస్యలపై వినతి

అనకాపల్లి టౌన్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడం హర్షణీయమని ఆమ్ ఆద్మీ జిల్లా కన్వీనర్ కొణతాల హరనాథ బాబు శుక్రవారం అన్నారు. బస్సుల్లో ప్రయాణికుల సమస్యలపై డీపీటీవోను కలిసి వినతిపత్రం అందజేశానన్నారు.

'మీకోసం'లో 124 అర్జీలు

పాడేరు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక(మీకోసం)లో స్వీకరించిన అర్జీల పరిష్కారాన్ని వేగవంతం చేయాలని కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ అధికారులను ఆదేశించారు. స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అలాగే అర్జీదారులు తమ వినతిపత్రాల స్థితిగతులను టోల్ ఫ్రీ నంబర్: 1100కు కాల్ చేసి సమాచారం తెలుసుకోవచ్చునన్నారు. ఈ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో గిరిజనుల నుంచి కలెక్టర్ దినేశ్‌కుమార్, జేసీ డాక్టర్ ఎంజే.అభిషేక్‌గౌడ, సబ్‌కలెక్టర్ శౌర్యమన్‌పటేల్, డీఆర్‌వో కె.పద్మలత, గిరిజన సంక్షేమ శాఖ ఎస్‌డీసీ ఎంవీఎస్.లోకేశ్వరరావు 124 వినతులను స్వీకరించారు. జిల్లాలో రాజవొమ్మంగి మండలం కె.వెలగలపాలెంనకు చెందిన నక్కా నాగరాజు తన చేతులు, కాళ్లు చచ్చుబడిపోయాయని, తనకు దివ్యాంగ పెన్షన్ మంజూరు చేయాలని కోరగా, పాడేరు మండలం కిండంగికి చెందిన తలారి బాలకృష్ణ తాము సాగు చేస్తున్న భూములకు హక్కులు కల్పించాలని కోరారు. కొయ్యూరు మండలం కాకరపాడు ప్రాంతంలో జాతీయ రహదారి నిర్మాణానికి గుర్తించిన బహుళ అంతస్తుల భవనాలు తొలగించలేదని, ప్రస్తుతం అవి ప్రమాదకరంగా ఉన్నాయని, వాటిని తొలగించి, మురుగు కాల్వలు నిర్మించాలని కోరగా, పెదబయలు మండలం గంపరాయి పంచాయతీ సాగుల గ్రామంలో జల్ జీవన్ మిషన్‌లో అందరి ఇళ్లకు తాగునీటి కొళాయిలు ఏర్పాటు చేయాలని గ్రామస్థుడు బొంజుబాబు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ వి.మురళీ, సమగ్ర శిక్ష ఏపీసీ స్వామినాయుడు, జిల్లా విద్యాశాఖాధికారి పి.బ్రహ్మాజీరావు, జిల్లా పంచాయతీ అధికారి చంద్రశేఖర్, గ్రామ సచివాలయాల నోడల్ అధికారి పీఎస్.కుమార్, ఐసీడీఎస్ పీడీ ఝాన్సీబాయి, జాతీయ రహదారుల డిప్యూటీ తహసీల్దార్ వి.ధర్మరాజు, జిల్లా వ్యవసాయాధికారి ఎస్‌బీఎస్.నందు, జిల్లా ఖజానాధికారి ప్రసాద్‌బాబు, పలువురు అధికారులు పాల్గొన్నారు.


ఐటీడీఏలోని మీకోసం కార్యక్రమానికి విచ్చేసిన జనం

జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీలకు బాలుడి ఎంపిక


పతకాలతో అభిలాష్

కొయ్యూరు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీలకు మండలంలో యు. చీడిపాలెంనకు చెందిన దడాల అభిలాష్ ఎంపికయ్యాడు. ఈ నెల 28న రాష్ట్ర స్థాయి ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల (ఈఎంఆర్) విద్యార్థులకు వై. రామవరంలో నిర్వహించిన బాక్సింగ్ పోటీల్లో ప్రస్తుతం అదే గ్రామ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న అభిలాష్ అండర్ -14 బాక్సింగ్ పోటీల్లో పాల్గొని బంగారు పతకం సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైయ్యాడు. అభిలాష్.. మండలంలో మారుమూల ప్రాంతమైన యు. చీడిపాలెం గ్రామ సర్పంచ్ రమేశ్ కుమారుడు. అభిలాష్ అక్క కీర్తి ప్రసన్న రెండేళ్ల కిందట రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలలో పాల్గొని బంగారు పతకం, జాతీ స్థాయిలో వెండి పతకాలు సా ధించింది. ఆమెను స్ఫూర్తిగా తీసుకుని అభిలాష్ బాక్సింగ్‌లో రాణిస్తున్నాడు.

సబ్సిడీ విత్తనాలను సద్వినియోగం చేసుకోండి: ఎంపీపీ


రాజ్‌మా విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ అప్పలరాజు, పక్కన ఎస్‌ఐ షణ్ముఖరావు

జి.మాడుగుల, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : సబ్సిడిపై రాజ్‌మా విత్తనాలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ ఎల్.అప్పలరాజు సూచించారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో శుక్రవారం ఎస్‌ఐ షణ్ముఖరావుతో కలిసి విత్తనాలను పంపిణీ చేశారు. ఎస్‌ఐ మాట్లాడుతూ, ప్రభుత్వం 90 శాతం సబ్సిడీపై విత్తనాలను అందిస్తుందన్నారు. సంప్రదాయ పంటలు పంటలపై దృష్టి పెట్టాలని సూచించారు. 630 క్వింటాళ్ల రాజ్‌మా విత్తనాలను సిద్దంగా ఉన్నాయని, ఏవో కె.వరప్రసాద్ రైతులకు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కె.సత్యనారాయణ, సర్పంచ్ కె.రాంబాబు, ఎంపీటీసీ సభ్యులు ఈశ్వరరావు, విజయ కుమారి, సిబ్బంది ప్రశాంత్, కూటమి నాయకులు ఎల్. బాలయ్యదొర, ఎం.నారాయణరాజు, పి.భీంబాబు తదితరులు పాల్గొన్నారు.

వేళకు రాని వైద్యాధికారులు.. రోగుల నిరీక్షణ


పెదబయలు పీహెచ్‌సీలో ఉదయం 11 గంటలకు మూసివేసి ఉన్న వైద్యాధికారి గది

పెదబయలు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక పీహెచ్‌సీలో వైద్యాధికారులు సమయపాలన పాటించకపోవడంపై రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం ఉదయం 11 గంటల వరకు ఆస్పత్రిలోని ఇద్దరు వైద్యాధికారులు విధులకు హాజరుకాలేదు. ఓపీ గది తెరవకపోవడంతో రోగులు నిరీక్షించాల్సి వచ్చింది. ఆస్పత్రిలో ఇద్దరు వైద్యులున్నా సరిగా అందుబాటులో ఉండడం లేదని పలువురు ఆవేదన వ్యక్తంచేశారు. ప్రస్తుతంగ్రామాల్లో జ్వారాలతో పలువురు బాధపడుతున్నారని, ఈ స్థితిలో వైద్యులు అందుబాటులో ఉండాలని కోరారు. ఈ విషయంపై వైద్యాధికారి నిఖిల్ వద్ద ప్రస్తావించగా, కిలగడ పీహెచ్‌సీలో వైద్యాధికారి సెలవు పెట్టడంతో అక్కడ ఓపీ చూడడానికి వెళ్లానన్నారు. మరో వైద్యాధికారి సత్యశ్రీ చోడవరం నుంచి బస్సులో రావడం వల్ల ఆలస్యం జరిగిందని తెలిపారు.

వ్యవహారిక భాషా వేత్త గిడుగు సేవలు అనిర్వచనీయం

చింతపల్లి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): తెలుగు భాష విశిష్టతను నేటి తరం విద్యార్థులు గుర్తించాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు యూవీ గిరి అన్నారు. శుక్రవారం చౌడుపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో తెలుగు భాష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా తెలుగు ఉపాధ్యాయులు బి. సన్యాసిరావు, శివకుమార్‌లను గ్రామ గిరిజనులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా గిరి మాట్లాడుతూ వ్యవహార భాషకు గిడుగురామ్మూర్తి చేసిన కృషిని వివరించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం నమ్మి సూర్యనారాయణ, పీఎస్‌హెచ్‌ఎం సరమండ బాలగంగాధర్ తిలక్, ఏపీసీపీఎస్‌ఈఏ ప్రధాన కార్యదర్శి కుడుముల వెంకట రమణ, గ్రామ పెద్దలు కోరాబు కరుణానిధి, పాఠశాల వైస్‌చైర్మన్ హిమజ, మహిళా సంఘం నాయకులు వరలక్ష్మి, పద్మకుమారి, వసంతకుమారి, రమాకుమారి, లలిత పాల్గొన్నారు. పాఠ్యపుస్తకాలు వ్యవహారిక భాషలో అందుబాటులోకి రావడం శుభపరిణామని స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్ డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి అన్నారు. శుక్రవారం స్థానిక ఏపీఆర్ జూనియర్ కళాశాలలో తెలుగు భాషా పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా వివిధ పాఠశాలల విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, చిత్రాల ప్రదర్శన పోటీలు నిర్వహించి విజేతలకు ధ్రువపత్రాలు అందజేశారు. తెలుగు భాష పరిరక్షణ సమితి కన్వీనర్ కె. రామ్మోహన్‌రావు, గురుకుల కళాశాలల కన్వీనర్ ప్రిన్సిపాల్ వై.పారయ్య, స్థానిక కళాశాల ప్రిన్సిపాల్ కెవీ రామేశ్వరం, జెడ్పీస్కూల్ హెచ్‌ఎం లక్ష్మణరావు, రంగబాబు, మల్లేశ్వరి పాల్గొన్నారు.

అనంతగిరి: వ్యవహారిక భాషకు పట్టం కట్టింది గిడుగు రామ్మూర్తి పంతులని ప్రధానోపాధ్యాయురాలు మంగమ్మ అన్నారు. స్థానిక గిరిజన సంక్షేమ బాలికల-2 పాఠశాలలోని తెలుగుభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. హెచ్‌ఎం తెలుగు భాషా పితామహుడు గిడుగు రామ్మూర్తి గొప్పతనంను వివరించారు. అనంతరం తెలుగు తల్లి వేషధారణలో విద్యార్థినులు పలు సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

సీలేరు: జీకేవీధి మండలం సీలేరు డీఏవీ పాఠశాలలో శుక్రవారం తెలుగు భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గిడుగు వెంకటరామ్మూర్తి నాయుడు చిత్రపటానికి నివాళులర్పించారు. ఉపాధ్యాయులు ఓం నమశివాయ, మూర్తి, నూకరాజు, కమలాకర్ పాల్గొన్నారు. స్థానిక బాలుర గురుకుల పాఠశాలలో కూడా ప్రిన్స్‌పాల్ బుచ్చిబాబు ఆధ్వర్యంలో , గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవం నిర్వహించారు.


వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులతో ఏడీఆర్, అధ్యాపకులు


సీలేరు డీఏవీ పాఠశాలలో గిడుగు వేషధారణలో విద్యార్థులు


అనంతగిరిలో తెలుగు ఉపాధ్యాయులను సత్కరిస్తున్న దృశ్యం

అందరి సహకారంతో గంజాయి సాగు నియంత్రణ : ఎస్పీ

పాడేరురూరల్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గంజాయి అక్రమ సాగు, రవాణా నియంత్రించేందుకు ప్రతీ ఒక్కరూ. సహకరించాలని ఎస్పీ అమిత్ బర్దార్ సూచించారు. శుక్రవారం ఆయన జీకేవీధి మండల గ్రామ పెద్దలతో ఎస్పీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన గ్రామీణ ప్రాంతంలో గంజాయి పెంపకం, అక్రమ రవాణా సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి సాగు, రవాణా, విక్రయించడం చట్టరీత్యా తీవ్రమైన నేరమన్నారు. ఈ సాగుతో కలిగే సామాజిక, ఆర్థిక నష్టాలను వివరించారు. యువతరం ఈ మాదకద్రవ్యాల వ్యసనంతో పతనమవుతుందని, కుటుంబ వ్యవస్థ ధ్వంసమవుతుందని వివరించారు. గంజాయి సాగుకు ప్రత్యామ్నాయంగా కాఫీ, మిరియాలు, పప్పు ధాన్యాలు, తదితరవాటిని సాగు చేయాలని కోరారు. అలాగే, అసాంఘిక కార్యకలాపాలపై సమీప పోలీసు స్టేషన్‌కు, లేదా 112కి ఫోన్ చేయాలని సూచించారు. అనంతరం వైద్యాధికారి మాట్లాడుతూ గంజాయి సేవించడంతో కలిగే ఆరోగ్య సమస్యలను వివరించారు. యువకులు, కౌమారదశలో ఉన్నవారిపై ఇది ఎక్కువగా ప్రతీకూల ప్రభావం చూపుతుందని తెలిపారు. గ్రామ పెద్దలు మాట్లాడుతూ గంజాయికి సంబంధించి ఎటువంటి కార్యకలాపాలు మా గ్రామాల్లో జరగనివ్వమన్నారు. గ్రామాల్లో యువతకు ఈ విషయాలపై అవగాహన కార్యక్రమాలను చేపడతామని స్పష్టం చేశారు.


జీకేవీధి మండల పెద్దలతో మాట్లాడుతున్న ఎస్పీ అమిత్ బర్దార్

రోగులకు మెరుగైన వైద్యసేవలందించాలి

» ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు


చింతపల్లి ఏరియా ఆస్పత్రిలో రోగితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

చింతపల్లి,ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏరి యా ఆస్పత్రిలో రోగులకు వై ద్యులు మెరుగైన వైద్యసేవలందించాలని పాడేరు ఎమ్మె ల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు కోరారు. శుక్రవారం ఆస్పత్రిని ఎమ్మెల్యే సందర్శించారు. వార్డుల్లో రోగులకు అందుతు న్న వైద్యసేవలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మె ల్యే మాట్లాడుతూ రోగులకు అన్నివేళలా వైద్యులు అందుబాటులో ఉండాలన్నారు. గైనికాలజిస్టు, ఎనస్థీషియా పోస్టులు భర్తీ కావడంతో గర్భిణులకు ఆస్పత్రిలోనే సిజేరియన్లు చేయాలన్నారు. వర్షాకాలం కావడంతో జ్వరాలతో అత్యధిక సంఖ్యలో రోగులు ఆస్పత్రికి వస్తున్నారన్నారు. వీరికి మెరుగైన చికిత్స అందించాలన్నారు. అలాగే ఖాళీగావున్న వైద్యులు పోస్టులను ప్రభుత్వం వెంటనే భర్తీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు కవడం ఈశ్వరరావు, జీకేవీధి వైసీపీ మండలాధ్యక్షుడు కంకిపాటి గిరిప్రసాద్, నాయకుడు నరేశ్ పాల్గొన్నారు.

కాఫీలో బెర్రీ బోరర్ తెగులుపై అప్రమత్తం

» ఉద్యానశాఖ అధికారి అరుణ కుమారి


తెగులుపై అవగాహన కల్పిస్తున్న ఉద్యానశాఖ అధికారి అరుణకుమారి

గూడెంకొత్తవీధి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): కాఫీ బెర్రి బోరర్ తెగులుపై రైతులు అప్రమత్తం కావాలని స్థానిక కాఫీ ప్రాజెక్టు ఉద్యానశాఖ అధికారి అరుణకుమారి తెలిపారు. శుక్రవారం కొత్తపాలెంలో గిరిజన రైతుల కాఫీ తోటల్లో బెర్రీ బోరర్ తెగులుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఉద్యానశాఖ అధికారి మాట్లాడుతూ కాఫీ బెర్రీ బోరర్ తెగులు అరకులోయలో బయటపడిందన్నారు. ఈ తెగులు వల్ల కాఫీ పంటను తీవ్ర స్థాయిలో నాశనం చేస్తుందన్నారు. సకాలంలో గుర్తించి నివారణ చర్యలు ప్రారంభించాలన్నారు. కాఫీ కాయలు, పండ్లతో నల్లని రంధ్రాలు కనిపిస్తే కాఫీ బెర్రీ బోరర్ తెగులు సోకినట్టు గుర్తించాలన్నారు. వెంటనే ఉద్యానశాఖ అధికారులకు సమాచారమివ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు పొత్తూరు కొండలరావు, జనసేన నేత కూడ మధు కుమార్, కాఫీ లైజన్ వర్కర్ లోత గంగరాజు, ఎఫ్‌సీ మర్రి చిన్నారావు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలతో జీవితాలు నాశనం: ఈగల్ టీమ్ ఇన్‌స్పెక్టర్


విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఈగల్ టీమ్ ఇన్‌స్పెక్టర్, తదితరులు

పాడేరు, ఆగ స్టు 29 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని జిల్లా ఈగల్ టీమ్ ఇన్‌స్పెక్టర్ శివశంకర్ నాయక్ సూచించారు. జిల్లా కేంద్రంలోని శ్రీఅక్షరా హైస్కూల్లో శుక్రవారం నిర్వహించిన మాదక ద్రవ్యాల వ్యతిరేక కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థి దశలో మత్తు పదార్థాల జోలికి వెళితే జీవితాలు పాడవుతాయన్నారు. ఎవరైనా చట్టవ్యతిరేక పనులకు పాల్పడితే టోల్ ఫ్రీ నెంబర్ 1972 కాల్ చేసి సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ రాజేశ్, సిబ్బంది, పాల్గొన్నారు.

ప్రకృతి సాగుతో జీవ వైవిధ్యం: ఏడీఏ

అనంతగిరి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వనరులను ఉపయోగించుకుంటూ వ్యవసాయం చేయడం వల్ల పర్యావరణ సమతుల్యతతోపాటు, జీవవైవిధ్యాన్ని పెంపొందించినట్టు అవుతుందని వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు ఏడీఏ మోహనరావు సూచించారు. మండలంలోని చిలకలగెడ్డ రైతు భరోసా కేంద్రంలో రైతులకు శుక్రవారం ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. రసాయన ఎరువులు, పరుగు మందులు వాడడం ద్వారా ఆరోగ్యానికి హానికరమని వివరించారు. మండల వ్యవసాయ అధికారి రంగారావు, సర్పంచ్ మజ్జి.అప్పారావు, పెసా కమిటీ అధ్యక్షుడు ఎం.సన్యాసిరావు పాల్గొన్నారు.

'గాలికొండ, అమ్మవారి ధారకొండలను మండలం మార్చొద్దు'


పాడేరు ఐటీడీఏ ఎదుట కరపత్రాలతో నిల్చున్న సర్పంచ్‌లు, ఇతర నాయకులు

సీలేరు, ఆగస్టు 29 , (ఆంధ్రజ్యోతి) : గాలికొండ, అమ్మవారిధారకొండ పంచాయతీలను గూడెంకొత్తవీధి మండలంలోనే కొనసాగించాలని కోరుతూ ఆ సర్పంచ్‌లు కె. బుజ్జిబాబు, ఎం. చంటిబాబు శుక్రవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. జీకేవీధి మండలం నుంచి తమ రెండు పంచాయతీలు 15 కిలోమీటర్ల లోపు ఉంటాయని వివరించారు. సేవలు చేరువగా ఉంటాయన్నారు. ఉపసర్పంచ్ ఎం సత్యవతి, లక్ష్మయ్య, మల్లేశ్వరరావు, కొండబాబు, శ్రీను , పండన్న పాల్గొన్నారు.

'భీరంను జి.మాడుగులలోనే కొనసాగించాలి'

జి.మాడుగుల, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): భీరం పంచాయతీని జి.మాడుగుల మండలంలోనే కొనసాగించాలని కోరుతూ శుక్రవారం పంచాయతీలో తీర్మానం చేశారు. స్థానిక సర్పంచ్ మాధుల రత్నకుమారి ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు ఈ్ర్ర్జూతీ అందించారు. మద్దిగరువుకు భీరం పంచాయతీకి 15 నుంచి 20 కిలో మీటర్లు దూరం ఉంటుందని, అదే జి.మాడుగులకు భీరం కేవలం 8కిలో మీటర్లు మాత్రమేనని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మాతె సన్యాసయ్య, నాయకులు కె. బొంజుబాబు, బి.లక్ష్మయ్య, ఎస్. సోమలింగం, కెసత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

నాలుగు కిలోల గంజాయి పట్టివేత

డుంబ్రిగుడ, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ఒడిశా రాష్ట్రం నుంచి అరకు మీదుగా విశాఖపట్నం వైపుతరలిస్తున్న నాలుగు కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు స్థానిక ఎస్‌ఐ పాపినాయుడు తెలిపారు. మండలంలోని జైపూర్ కూడలిలో వాహనాల తనిఖీ చేపడుతుండగా... ఒడిశా నుంచి బైక్‌లపై వస్తున్న వారినుంచి ఈ గంజాయి పట్టుబడిందన్నారు. రెండు ద్విచక్ర వాహనాలు, ఆరుగురిని అరెస్టు చేశామన్నారు.

నేత్రదానంపై అవగాహన ర్యాలీ

హుకుంపేట ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి); నేత్రదానంపై అవగాహన పెంపొందించుకోవాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి సౌజన్య అన్నారు. శుక్రవారం 40వ జాతీయ నేత్ర దా న ఉత్సవాలు సందర్భంగా వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు భార్గవి, ప్రియలక్ష్మి, సూపర్‌వైజర్లు, ఎన్ఎంలు, ఆశా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకర ప్రయాణం

» కర్రల వంతెనపై మల్లిపాడు గిరిజనుల రాకపోకలు


కర్రల వంతెనపై నడుస్తున్న మహిళలు

జి.మాడుగుల, ఆగస్టు 29 (ఆంధ్రజోతి): మండలంలోని సొలభం పంచాయతీ మారుమూల మల్లిపాడు గ్రామం చేరుకోవాలంటే పెద్ద సాహసమే చేయాలి. గ్రామంలో 20 గిరిజన కుటుంబాలు పూర్వం నుంచి నివాసం ఉంటున్నాయి. వర్షాకాలం వచ్చిందంటే.. వారి కష్టాలు వర్ణణాతీతం. గ్రామానికి వెళ్లే దారిలో పెద్ద వాగు ఉంది. దానిపై వంతెన లేదు. ఎన్నో ఏళ్లుగా వంతెన నిర్మించాలని మల్లిపాడు గ్రామస్థులు అధికారులు, పాల కులను వేడుకుంటు న్నారు. అయినా వంతెన మంజూరు కాలేదు. దీంతో ఆ గ్రామస్థులు బయట గ్రామాలకు వెళ్లాలంటే వాగు దాటేందుకు చెట్ల మధ్య కర్రలు కట్టి వంతెనలా ఏర్పాటు చేసుకున్నారు. ఈ కర్రల వంతెనపై వెళ్లేటప్పుడు పడిపోకుండా ఒక తాడును వాగుకు రెండు వైపులా కట్టుకున్నారు. తాడు పట్టుకొని కర్రల వంతె నపై దేవుడిపై భారం వేసి నడుస్తూ రాకపోకలు సాగిస్తారు. కర్రెల వంతెన కింద ఉధృతంగా ప్రవహించే పెద్ద వాగు ఉంది. ఏ మాత్రం కాలు జారినా వాగులో కొట్టుకుపోయే ప్రమాదం ఉంది.

ఘనంగా క్రీడా దినోత్సవం

చింతపల్లి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రీడలపై ఆసక్తి పెంపొందించుకోవాలని స్థానిక డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. విజయ భారతి అన్నారు. శుక్రవారం కళాశాలలో జాతీయ క్రీడాదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తొలుత ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. క్రీడల్లో రాణించిన విద్యార్థులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పీడీ కె. శివరామ్ కుమార్, అధ్యాపకులు లీలాపావని, రవీంద్రనాథ్, జగదీశ్, గ్రంథాలయ అధికారి జగ్గత్‌రాయ్ పాల్గొన్నారు.


వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులతో ఏడీఆర్, అధ్యాపకులు

కొయ్యూరు: మర్రిపాలెం ప్రభుత్వ మహిళ కళాశాలలో ప్రముఖ హాకీ క్రీడాకారుడు ధ్యాన్ చంద్ చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ కర్రి సుధ మాట్లాడుతూ దేశానికి క్రీడా రంగంలో ధాన్‌చంద్ అందించిన సేవలకు గుర్తుగా ఏటా క్రీడా దినోత్సవం నిర్వహిస్తున్నారన్నారు. పలు పోటీల్లో గెలుపొందిన విద్యార్థినులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వికేటి మహాలక్ష్మి, పీడీ ఎల్. రమణమ్మ, అధ్యాపకులు పి.మంగమ్మ, బి.కుమారి, శ్రీవిద్య, రాజబాబు, పుష్ప, డి.శ్రీనివాసులు, పి.వెంకటరమణ, బి.శేఖర్, భువనేశ్వరి, సీత తదితరులు పాల్గొన్నారు.


మర్రిపాలెంలో ధాన్‌చంద్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

పిల్లిగెడ్డ వంతెన వద్ద ట్రాఫిక్‌కు అంతరాయం


వంతెన అప్రోచ్‌రోడ్డు వద్ద కూరుకుపోయిన సిమెంట్ లారీ

సీలేరు, ఆగస్టు 29 , (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రా ఒడిశా సరిహద్దులోని పిల్లిగెడ్డ వంతెన వద్ద సిమెంట్ లోడుతో వె ళ్తున్న లారీ శుక్రరం బురదలో కూరుకుపో యింది. దీంతో సరిహద్దులో రాకపోకలు నిలిచిపోయాయి. 2024 సెప్టెంబరు 8న వచ్చిన భారీ వర్షాలకు ఇక్కడి పాత వంతెన కొ ట్టుకుపోయింది. అనంతరం కొత్త వంతెన నిర్మించారు. రెండు వైపులా ఎర్రమట్టితో అప్రోచ్ వేసి రాకపోకలను సాగిస్తున్నారు. ఇలా ఎర్రమట్టి వదిలేయడంతో చిన్నపాటి వర్షం కురిసినా బురదమయంగా మారి వాహనాలు కూరుకుపోతున్నాయి. రెండు రాష్ట్రాల మధ్య రాకపోకలు నిలిచిపోతున్నాయి. సమస్య పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు.

'వెలుగు వీవోఏల సమస్యలు పరిష్కరించాలి'


మహాసభలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పోతురాజు

పాడేరురూరల్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): వెలుగు వీవోఏల కాలపరిమితి జీవోను రద్దు చేసి వేతనాలు పెంచాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు వి.పోతురాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని మినుములూరు గ్రామంలో వీవోల సంఘం జిల్లా అధ్యక్షురాలు ఆర్.భాను అధ్యక్షతన శుక్రవారం వెలుగు వీవోఏల రెండో మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాయుడు వెలుగు వీవోఏలకు ఇచ్చిన ఎన్నికల హామీని నెరవేర్చాలని ఆయన డిమాండ్ చేశారు. వేతనాలు పెంచాలని, మూడు సంవత్సరాల కాలపరిమితి సర్క్యులర్ రద్దు చేయాలని, వేధింపులు ఆపాలని, ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలన్నారు. తొలగించిన వీవోఏలను విధుల్లోకి తీసుకోవాలని కోరారు.కార్యక్రమంలో సీఐటీయూ నేత ఎల్.సుందరరావు, వీవోఏలసంఘం నాయకులు భాను, రాజ్‌కుమార్, భాస్కరరావు, సోంబాబు, సువర్ణ, పాడేరు డివిజన్ 11 మండలాల వీవోఏలు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఇద్దరికి గాయాలు


చికిత్స పొందుతున్న యువకులు

చింతపల్లి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): గూడెంకొత్తవీధి మండలం ఏబులం కొడిసింగి గ్రామంలో ఇద్దరు యువకులు విద్యుదాఘాతానికి లోనై గాయాలపాలయ్యారు. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామంలో శుక్రవారం ఉద యం గెమ్మెలి సత్తిబాబు, మర్రి నరేంద్రలు ఓ ఇంటి స్లాబ్ నిర్మాణం కోసం ఐరన్ కడుతున్నారు. ఈ ఊచలు సమీపంలోనున్న విద్యుత్ తీగలకు తగలడంతో వారిద్దరూ విద్యుదాఘాతానికి గురయ్యారు. వీరిని స్థానికులు స్థానిక ఏరియా ఆస్పత్రికి తీసుకువచ్చిచికిత్స అందిస్తున్నారు. బాధితుల ఆరోగ్యం నిలకడగావుందని వైద్యులు తెలిపారు.

ఏపీటీఎఫ్ నూతన కార్యవర్గం


అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద్రరావు, మహేశ్

చింతపల్లి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ఏపీటీఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా కాకరి చంద్రరావు, కిముడు మహేశ్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు జిల్లా ఉపాధ్యక్షుడు దేపూరి శశి కుమార్ తెలిపారు. శుక్రవారం స్థానిక గిరిజనభవన్‌లో ఉపాధ్యాయులు సమావేశమై నూతన కార్యవర్గాన్ని ఎన్నికున్నారు. ఉపాధ్యక్షులుగా రాజేశ్వరి, ఎస్. సత్యనారాయణ, కార్యదర్శులుగా బేరా సత్యవతి, పి. అచ్చుత్, ప్రసాద్, కామేశ్ ఎన్నికయ్యారు.

బీసీ కులాల అభివృద్ధికి కృషి

» బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు శంకరరావు


సమావేశంలో మాట్లాడుతున్న అధ్యక్షులు శంకరరావు

పాడేరురూరల్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉన్న బీసీ కులాల ఆర్థికాభివృద్ధికి, సంక్షేమానికి తనవంతు కృషి చేస్తానని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు హామీ ఇచ్చారు. జిల్లా పర్యటనకు వచ్చిన ఆయన శుక్రవారం స్థానిక ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయంలో పాడేరులో ఉంటున్న వివిధ బీసీ కులాలకు చెందిన సంఘ నాయకులతో సమావేశమయ్యారు. 40, 50 ఏళ్లగా పాడేరు గిరిజన ప్రాంతంలో జీవనం సాగిస్తున్న బీసీ కులాల వారి స్థితిగతులు అంతంత మాత్రంగానే ఉన్నాయన్నారు. గిరిజన హక్కులు, చట్టాలు అడ్డుగోడగా నిలవడంతో అనేక ప్రభుత్వ పథకాలు అందిపుచ్చుకోలేని స్థితిలో బీసీ కులాలకు చెందిన వారు ఉన్నారన్నారు. ఇకనైనా జిల్లాలో ఉన్న 22 మండలాలకు చెందిన అన్ని బీసీ కులాలు ఏకతాటిపైకి వచ్చి సంఘటితంగా సంఘాన్ని ఏర్పాటు చేసుకోవాలన్నారు. పథకాలు అందేలా చూస్తామన్నారు. అనంతరం మోదకొండమ్మ, ఉమానీలకంటేశ్వరస్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో జంగమ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు శివరాత్రి శ్రీనివాస్‌కుమార్,నాయకులు గగణం రాజు, వెయ్యాకుల సత్యనారాయణ, విజయ్, రాజేష్, విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు కె.వెంకటరమణ, సెయ్యల సంఘం అధ్యక్షుడు గుడే శ్రీను, దలాయి వెంకటరావు, నాయీబ్రాహ్మణుల సంఘం ప్రతినిధులు, ఓబీసీజిల్లా సంచార జాతుల స్ఫూర్తి కమిటీ కో-ఆర్డినేటర్ కెజియారాణి, కిల్లో కోటిబాబు, రామారావు, రత్నం పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

డుంబ్రిగుడ, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అరకు సంతబయలులోని ఆక్సిజన్ హస్పిటల్లో శుక్రవారం అపోలో హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సికిల్ ఎనీమియా, తలసేమియా వ్యాధులతోపాటు మహిళలకు సంబంధించించిన వ్యాధులపై స్క్రీనింగ్ టెస్టుల నిర్వహించారు. 250 మందికి వైద్య సేవలందించి మందులు పంపిణీ చేశారు. ఆక్సిజన్ హాస్పిటల్ వైద్యాధికారి విజయ్ కుమార్, విశాఖ అపోలో క్యాన్సర్ హాస్పిటల్ గైనిక్ ఎండీ సౌమ్య, అంకాలజిస్ట్ అబ్దుల్ రషీద్, బ్రహ్మజీ, ప్రోగ్రాం కో ఆర్డినేటర్ అనిల్ గోపి సిబ్బంది పాల్గొన్నారు.


సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

నర్సీపట్నం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్న పలువురు లబ్ధిదారులకు వైద్య ఖర్చుల నిమిత్తం మంజూరైన ముఖ్య మంత్రి సహాయనిధి చెక్కులను స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు శుక్రవారం పంపిణీ చేశారు. తన క్యాంప్ కార్యాలయంలో గొలుగొండ, నాతవరం, మాకవరపాలెం, నర్సీపట్నం మండలం, మునిసిపాలిటీకి సంబంధించిన లబ్ధిదారులకు రూ.2.4 లక్షలు చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాతవరం మండల అధ్యక్షుడు ఎస్.వెంకటరమణ, తాండవ చైర్మన్ కె.సత్యనారాయణ, కౌన్సిలర్ రాజునాయుడు పాల్గొన్నారు.

నేత్రదానంతో మరో ఇద్దరికి కంటి చూపు


నర్సీపట్నం మెయిన్ రోడ్డులో ర్యాలీ చేస్తున్న ఆస్పత్రి సిబ్బంది

నర్సీపట్నం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): నేత్రదానం చేయడం ద్వారా మరో ఇద్దరికి కంటి చూపు ఇవ్వొచ్చని ప్రాంతీయ ఆస్పత్రి మెడికల్ సూప రింటెండెంట్ డాక్టర్ సుధాశారద చెప్పారు. జాతీయ నేత్ర దాన పక్షోత్సవా ల్లో భాగంగా ఆంధ్రప్రదేశ్ జాతీయ అంధత్వ నివారణ, దృష్టి లోప నివార ణ కార్యక్రమంలో శుక్రవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఏరియా ఆస్పత్రి నుండి అబీద్ సెంటర్ వరకు ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా డాక్టర్ సుధాశారద మాట్లాడుతూ నేత్రదానానికి ప్రతీ ఒక్కరూ మద్దతు పలకాలని కోరారు. నేత్రదానాన్ని కుటుంబపు వారసత్వ సంప్రదాయంగా చేసుకోవాలని ఆమె సూచించారు. నేత్రదానం చేయడం ద్వారా ఇద్దరికి చూపు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

చోడవరంలో ప్రతిజ్ఞ


ప్రతిజ్ఞ చేస్తున్న వైద్యులు, సిబ్బంది, నాయకులు

చోడవరం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక కమ్యూనిటీ ఆసుపత్రిలో శుక్రవారం జాతీయ నేత్రదాన పక్షోత్సవం సందర్భంగా వైద్యులు, సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. నేత్రదానంపై అవగాహన కల్పించే లక్ష్యంతో ఈ కార్యక్ర మాలు నిర్వహిస్తున్నట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ సిరికి దినేశ్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పెదబాబు, నాయకులు డి.వెంకట అప్పారావు, సకురు కోటేశ్వరరావు, పప్పు శ్రీను, బొబ్బిలి ఈశ్వర రావు, బి.పార్వతి, దేవుడు, ఎలకా మల్లిబాబు, గుమ్మాల సత్తిబాబు, పార్థురాజు, శ్యాంసుందర్, ఎర్రంశెట్టి చిన్న పాల్గొన్నారు.

బాక్సింగ్ క్రీడాకారిణులకు సత్కారం



బాక్సింగ్ క్రీడాకారిణులకు బహుమతులు అందిస్తున్న ఎస్ఐ

నర్సీపట్నం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎన్టీఆర్ మినీ స్టేడి యంలో వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర స్థాయి అమరావతి బాక్సింగ్ పోటీల్లో బంగారు పతకాలు సాధించిన యర్రా తేజస్విని, బొంతు మౌనికకు సత్కరించారు. పట్టణ ఎస్ఐ ఉమామహేశ్వరరావు చేతుల మీదుగా వారికి బహుమతులు అందించారు. అలాగే వ్యాయామ ఉపాధ్యా యుడు రమేశ్‌ను సత్కరించారు. అనంతరం ఎస్ఐ మాట్లాడుతూ బాక్సింగ్ క్రీడాకారిణులు ఓ పక్క చదువుతూ, మరోవైపు కష్టపడి శిక్షణ తీసుకొని రాష్ట్ర స్థాయిలో బంగారు పతకాలు సాధించడం అభినందనీయ మన్నారు. జాతీయ స్థాయిలో కూడా రాణించి మరిన్ని పతకాలు సాధిం చాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు కామి రెడ్డి సత్యనారాయణ, అల్లు అప్పారావు, ఎంవీ.రంగారావు, పిట్ల శ్రీనివాస రావు, అడిగర్ల వరహాలనాయుడు, బాబి మాస్టారు పాల్గొన్నారు.

పాఠశాల మాజీ చైర్మన్‌తో జెండా ఆవిష్కరణపై విచారణ

గొలుగొండ, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సాలికమల్లవరం పాఠశాలలో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా పాఠశాల మాజీ చైర్మ న్‌తో హెచ్ఎం సునీల్‌కుమార్ జెండా ఆవిష్కరణ చేయించారన్న ఫిర్యాదుపై ఎంఈవోలు సత్యనారాయణ, కృష్ణప్రసాద్ శుక్రవారం విచారణ చేపట్టారు. స్థానిక ప్రజలు, ఫిర్యాదుదారులు, ప్రజా ప్రతినిధులతో వారు మాట్లాడి వివరాలు సేకరించారు. అనంతరం ఎంఈవోలు మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థిని టీసీ తీసుకుని కేజీబీవీ చేరిందని, బాలిక తండ్రి పాఠశాల చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారని తెలిపారు. వేరే పాఠశాలకు విద్యార్థి వెళ్లిపోతే కమిటీ రద్దు చేయాల్సి ఉండగా, మండల విద్యా శాఖకు ఉపాధ్యాయుడు ఎటువంటి సమాచారం ఇవ్వలేదన్నారు. ఆగస్టు 15వ తేదీన జెండా ఆవిష్కరణ కమిటీ మాజీ చైర్మన్‌తో చేయించినట్లు స్థాని కులు తెలిపారని ఎంఈవోలు చెప్పారు. ఈ నివేదికను జిల్లా కలెక్టర్‌కు అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఫిర్యాదుదారులు పాల్గొన్నారు.

కోనాం నుంచి 200 క్యూసెక్కుల విడుదల


జలాశయం గేట్లు ద్వారా విడుదల అవుతున్న నీరు

చీడికాడ, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): కోనాం జలాశయం మెయిన్ గేట్లు, కాలువల ద్వారా 200 క్యూసెక్కుల వరద నీటిని బొడ్డేరు నదిలోకి శుక్రవారం విడుదల చేసినట్లు ఇరిగేషన్ శాఖ ఏఈఈ బీవీ సత్యనారాయణదొర తెలిపారు. జలా శయం గరిష్ఠ స్థాయి నీటిమట్టం 101.25 మీటర్లు కాగా, ప్రస్తుతం 99.60 మీటర్లు ఉందన్నారు. ఇన్‌ఫ్లో 260 క్యూసెక్కులు ఉందని.. ఔట్‌ఫ్లో 200 క్యూసెక్కులు విడుదల చేస్తున్నామన్నారు. ఈ మేరకు బొడ్డేరు నదీ పరివాహక ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తం చేయాలని రెవెన్యూ, పోలీస్ అధికారులకు సమాచారం అందజేశామన్నారు.

అనధికార లేఅవుట్ల క్రమబద్ధీకరణపై అవగాహన

▸▸ వీఎంఆర్‌డీఏ ప్లానింగ్ అధికారి శ్రీనివాసరావు

చోడవరం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల పరిధిలో అక్రమ లేఅవుట్ల క్రమబద్ధీకరణకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన పథకంపై పంచాయతీ కార్యదర్శులు అవగాహన కల్పించాలని వీఎంఆర్‌డీఏ పట్టణ ప్రణాళిక అధికారి శ్రీనివాసరం సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అనధికార లేఅవుట్లను క్రమబద్ధీకరించేందుకు తీసుకువచ్చిన ఎల్ఆర్ఎస్ పథకం ద్వారా కలిగే ప్రయోజనాలను లేఅవుట్లు, ప్లాట్ల కొనుగోలు చేసిన వారికి వివరించాలన్నారు. ఈ పథకం ద్వారా క్రమబద్ధీకరించుకున్న వారికి ప్రభుత్వం ప్రకటించిన ప్రోత్సాహకాలు, అర్హతలను ఆయన తెలిపారు. అనంతరం మండలంలోని అనధికార లేఅవుట్ల వివరాలను సేకరించారు. ఈ సమావేశంలో టౌన్ ప్లానింగ్ అధికారులు సూర్యనారాయణ, గిరిధర్, సునీత, చోడవరం, చీడికాడ ఈవోపీఆర్‌డీలు అర్జునరావు, చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.


కె.కోటపాడు సమావేశంలో మాట్లాడుతున్న ప్లానింగ్ అధికారి శ్రీనివాసరావు

కె.కోటపాడులో కార్యదర్శులు, వీఆర్వోలతో సమావేశం

కె.కోటపాడు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో వేసిన అనధికార లేఅవుట్ల క్రమబద్ధీకరణపై పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలతో వీఎంఆర్‌డీఏ అధికారులు మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. మండ లంలో ఎక్కడెక్కడ అనధికార లేఅవుట్లు ఉన్నాయి, వాటి స్థితిగతులపై చర్చించారు. అనంతరం ప్లానింగ్ అధికారులు వి.సూర్యనారాయణ, డి.శ్రీనివాసరావు మాట్లా డుతూ లేఅవుట్‌లో ప్లాట్లు క్రమబద్ధీకరణ పథకం 2020ను పొడిగిస్తూ ప్రభుత్వం సవరణ ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. క్రమబద్ధీకరణ వల్ల ఎన్నో ప్రయోజనాలు చేకూరుతాయని, ప్రధానంగా చట్టబద్ధమైన రిజిస్ట్రేషన్లు, బ్యాంకు రుణాలు పొందవ చ్చని తెలిపారు. వీటిపై ప్లాట్ యజమానులకు పూర్తి అవగాహన కలిగించాలని కార్యదర్శులు, వీఆర్వోలకు వారు సూచించారు. ఈ కార్యక్రమంలో జూనియర్ ప్లానింగ్ అధికారి ఎ.సునీత, సర్వేయర్ ఎ.గిరిధర్ పాల్గొన్నారు.

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం

నర్సీపట్నం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): తెలుగు భాషా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. నర్సీపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గిడుగు చిత్ర పటానికి ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రాజు ఆధ్వ ర్యంలో పూలమాలలు వేసి నివాళుల ర్పించారు. ఈ సందర్భంగా విశ్రాంత తెలుగు అధ్యాపకుడు ఎలమంద ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తెలుగు సాహిత్యానికి గిడుగు రామ్మూర్తి చేసిన కృషిని వివరించారు. ఈ కార్యక్రమంలో తెలుగు అధ్యాపకులు ఎం.ధర్మారావు, విద్యార్థులు పాల్గొన్నారు.



నర్సీపట్నంలో మాతృ భాష గురించి వివరిస్తున్న అధ్యాపకుడు ఎలమంద... చోడవరంలో తెలుగు అధ్యాపకులకు సన్మానం

చోడవరంలో...

చోడవరం: మండలంలోని పలు విద్యా సంస్థల్లో తెలుగు భాషా దినోత్సవం నిర్వహించారు. ఉషోదయ బీఈడీ కళాశాలలో నిర్వహించి కార్యక్రమంలో తెలుగు భాషా పితామహుడు గిడుగు రామమూర్తి పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా తెలుగు అధ్యాపకులు వి.రమేశ్‌బాబు, ఎం.గోవింద్, ఎం.రాము, జ్యోతిని విద్యార్థులు సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వీ.వీ.ఎస్.మూర్తి పాల్గొన్నారు. అలాగే ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో తెలుగు భాషా, జాతీయ క్రీడల దినోత్సవాలను నిర్వహించారు. ప్రిన్సి పాల్ కిరణ్‌కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

కె.కోటపాడులో...

కె.కోటపాడు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠ శాలలో శుక్రవారం తెలుగు భాషా, జాతీయ క్రీడా దినోత్సవాలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు పద్యాలు, వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్, వివిధ రకాల ఆటలు పోటీలను నిర్వహించారు. వంద మంది కవుల చిత్రపటాలతో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎస్వీ పద్మావతి, తెలుగు ఉపాధ్యాయులు మురళీకృష్ణ, ఏవీ రమణమ్మ, కృష్ణవేణి, వ్యాయామ ఉపాధ్యాయులు ఆర్.లక్ష్మి తది తర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బుచ్చెయ్యపేటలో...

బుచ్చెయ్యపేట: మండలంలోని దిబ్బిడి ఉన్నత పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా ని ర్వహించారు. హెచ్ఎం కేతిరెడ్డి సత్యారావు గిడుగు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలుగు భాష కోసం గిడుగు ప్రత్యేక చరిత్రను నెలకొల్పారన్నారు. అందుకే తెలుగు ప్రజలు ఆయనకు రుణ పడి ఉంటారని పేర్కొన్నారు. అనంతరం తెలుగు ఉపాధ్యా యులు అనసూయ, బాలను సన్మానించారు. తెలుగు వ్యాకరణం, పద వినోదాలలో విజేతలకు బహు మతులు అందచేశారు.

మాకవరపాలెంలో...

మాకవరపాలెం: మండలంలోని తూటిపాల పాఠ శాలలో గిడుగు జయంతిని ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు రాము మాట్లాడుతూ తెలుగు భాషను అందరికీ అందేలా చేసిన మహనీయుడని అన్నారు. అలాగే ప్రతి ఒక్కరూ రామ్మూర్తిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దేవరాపల్లిలో...

దేవరాపల్లి: మండలంలోని కాశీపురం జిల్లా పరి షత్ ఉన్నత పాఠశాలలో వ్యవహారిక భాషా పితామ హుడు గిడుగు రామ్మూర్తి, హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి ఉత్సవాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విద్యార్థినుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. ప్రధానోపాధ్యాయురాలు పి.బి.టి.సుందరి, కొటాన రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నివారణకు చొరవ చూపండి

▸▸ ఐసీడీఎస్ పీవో ఎన్.సూర్యకళ

చీడికాడ, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాల నివారణకు ప్రత్యేక చొరవ చూపాలని ఐసీడీఎస్ పీవో ఎన్.సూర్యకళ సూచించారు. మండలంలోని దండిసుర వరం, బైలపూడి అంగన్‌వాడీ కేంద్రాలను శుక్రవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు, కేంద్రంలో అమలుచేస్తున్న మెనూ, పిల్లల వ్యక్తిగత పరిశుభ్రత, కేంద్రం ఆవరణలో పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. పిల్లలు వయస్సుకు తగ్గ బరువు ఉండాలని, కేంద్రానికి వస్తున్న పిల్లల్లో అనారోగ్యం ఉంటే వారిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని పోషకాహారం అందేలా చూడాలని సూచించారు. బైలపూడిలో పిల్లల తల్లులతో సమావేశమయ్యారు. ఆడ పిల్లలను చక్కగా చది విస్తూ, వారు చెడు వ్యసనాలకు లోనుకాకుండా చూడాలన్నారు. అలాగే బాల్యవివాహాలను ప్రోత్సహించరాదని స్పష్టం చేశారు. 21 ఏళ్లు దాటిన తర్వాతే వివాహాలు చేయాలన్నారు. అనంతరం విలేకరులతో ఆమె మాట్లాడుతూ, జిల్లాలో 112 సొంత భవనాల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని, అసంపూర్తి నిర్మా ణాలతో ఉన్న భవనాల పూర్తికి ప్రతిపాదనలు పంపామన్నారు. ఈ పరిశీలనలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌లు గొర్లె రమాదేవి, పి.చిన్నమ్మలు, ఈశ్వరమ్మ పాల్గొన్నారు.


పిల్లలకు పెడుతున్న ఆహారాన్ని పరిశీలిస్తున్న పీవో సూర్యకళ

సాహస బాలిక సాహితికి ఘన సత్కారం


సాహితిని సత్కరిస్తున్న దృశ్యం

రోలుగుంట, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని అంతర్జాతీయ క్రీడాకారిణి, సాహస బాలిక అవార్డు గ్రహీత సాహితిని శుక్రవారం ఘనంగా సత్కరించారు. విశాఖలో నిర్వ హించిన ఓ ప్రత్యేక కార్యక్రమంలో సాహితికి సత్కారం జరిగింది. క్రీడా రంగంలో సాధించిన సాహితి విశేష ప్రతిభ కనబర్చారని ఈ సందర్భంగా వక్తలు కొనియాడారు. చిన్న వయస్సులోనే ఉన్నత శిఖరాల ను అధిరోహించిన సాహితి భవిష్యత్‌లో మరిన్ని పతకాలు సాధించి దే శానికి మంచిపేరు తీసురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో విజ్ఞాన విద్యాలయం యాజమాన్యం పాల్గొన్నారు.

తహశీల్దార్ కార్యాలయంలో అక్రమాలపై విచారణకు ప్రభుత్వం ఆదేశాలు

రోలుగుంట, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): రోలుగుంట తహశీల్దార్ కార్యాలయంలో జరిగిన అక్రమాలపై విచారణకు ప్రభుత్వం ఆదేశిం చింది. 2023 జనవరి 20న జరిగిన ఏసీబీ అధికారుల ఆకస్మిక తనిఖీల్లో అక్రమాలు జరిగినటుట ఏసీబీ నివేదిక స్పష్టం చేసింది. ఈ కేసులో ప్రమేయం ఉన్న రిటైర్డ్ తహశీల్దార్ కొటారి వెంకటేశ్వరావు, డిప్యూటీ తహశీల్దార్ హనుమంతు త్రివేణి, వీఆర్వో సన్యాసి సాహెబ్‌పై విచారణ జరపాలని ప్రభుత్వం నిర్ణయించింది.

ఈ మేరకు ముగ్గురు అధికారులపై సంయుక్త విచారణ నిర్వహిం చేందుకు విచారణ అధికారిగా రెవెన్యూ శాఖ ప్రత్యేక కార్యదర్శిని ని యమించనుంది. ఏపీ సివిల్ సర్వీసెస్ 1991, రివైజ్డ్ పెన్షన్ రూల్స్ 1980 ప్రకారం విచారణ అనంతరం చర్యలు చేపట్టనుంది. ఈ మేరకు ముగ్గురు రెవెన్యూ ఉద్యోగులపై విచారణ జరపాలని ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జి.జయలక్ష్మి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

కాగా ఆరోపణలు ఎదుర్కొంటున్న అప్పట్లో పనిచేసిన తహశీల్దార్ కొటారి వెంకటేశ్వరరావు బుచ్చెయ్యపేట మండలానికి బదిలీపై వెళ్లి, అక్కడే వలంటీరీ రిటైర్మెంట్ తీసుకున్నారు. ఇక, డిప్యూటీ తహశీల్దార్ త్రివేణి మాడుగుల సీఎస్‌డీటీగా పదోన్నతిపై వెళ్లారు. అలాగే ఇటీవల మరలా పదోన్నతుల్లో భాగంగా అల్లూరి జిల్లాకు తహశీల్దార్ వెళ్లారు. ప్రస్తుతం అక్కడే విధులు నిర్వహిస్తున్నారు. వీఆర్వో సన్యాసి సాహెబ్ ప్రస్తుతం నర్సీపట్నంలో వీఆర్వోగా పనిచేస్తున్నారు.

చవితి ఉత్సవాల్లో డ్రోన్ కెమెరాలతో సర్వే

రావికమతం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): వినాయక నవరాత్రి ఉత్సవాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా ముందు జాగ్రత్త చర్యగా రావికమతం పోలీ సులు శుక్రవారం డ్రోన్ సర్వే నిర్వహించారు. రావికమతం పోలీస్ స్టేషన్ పరిధిలో సమస్యాత్మక గ్రామాలైన రావికమతం, మేడివాడ, గర్నికం, గుమ్మాళ్లపాడు, చినపాచిలతో పాటు పలు గ్రామాలను కొత్తకోట సీఐ కోటేశ్వరావు ఆదేశాల మేరకు ముందుగానే డ్రోన్ సర్వే నిర్వహించి నిఘా పెడుతున్నామని ఎస్ఐ ఎం.రఘువర్మ తెలిపారు. గతంలో జరిగిన సంఘటనల దృష్ట్యా ముందస్తు చర్యలు చేపడుతున్నామన్నారు. వినాయక నవరాత్రి ఉత్స వాల్లో గ్రామాల్లో ఎలాంటి గొడవలు, అల్లర్లకు తావు లేకుండా చూడాలని చెప్పారు.

కాఫీ పొడి తయారీ కేంద్రం స్థలం అప్పగింత


జీసీసీ అధికారులకు భూమిని అప్పగిస్తున్న తహశీల్దార్

మాకవరపాలెం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): శెట్టిపాలెం గ్రామంలో కాఫీ పొడి తయారీ కేంద్రానికి సంబంధించిన స్థలాన్ని జీసీసీ శాఖ అధికారులకు తహశీల్దార్ జి.వెంకటరమణ శుక్రవారం అప్పగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల గ్రామంలో కాఫీ పొడి తయారీ కేంద్రం నిర్మాణానికి ప్రభుత్వం రూ.10 కోట్లు మంజూరు చేసిందన్నారు. ఈ నిధులతో కేంద్రం నిర్మాణానికి ఇక్కడ 12 ఎకరాల ప్రభుత్వ భూమిని రెవెన్యూ తీసుకొని గిరిజన శాఖ అధికారులకు అప్పగించినట్టు చెప్పారు. ఈ కేంద్రంలో మొదటి విడతగా సుమారు 300 నుంచి 500 మందికి ఉపాధి లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జీసీసీ డీఈ వంశీ, డీటీ నూకరాజు, మండల సర్వేయర్ వెంకటేశ్వర్లు, శెట్టిపాలెం సర్పంచ్ అల్లు రామునాయుడు, సచివాలయం ఉద్యోగులు పాల్గొన్నారు.

వినాయక ఉత్సవాల్లో మాజీ మంత్రి అమర్


ఉత్సవాల్లో పాల్గొన్న మాజీ మంత్రి అమర్

చోడవరం, ఆగస్టు 29 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని వినాయక చవితి ఉత్సవాల్లో మాజీ మంత్రి అమర్‌నాథ్ శుక్రవారం పాల్గొ న్నారు. పీఎస్.పేట లక్ష్మీగణపతి ఆలయంతో పాటు స్థానిక 63 అడుగుల ఆదిగణపతి విగ్రహాన్ని అమర్ సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్ర మంలో లక్ష్మీగణపతి ఆలయ నిర్వాహకులు పుత్రేవు శ్యాంసుందర్, ఎంపీపీ గాడి కాసులమ్మ, వైసీపీ నాయకులు ఏడువాక సత్యారావు, శ్రీకాంత్, బొడ్డేడ సూర్యనారాయణ, బైన ఈశ్వరరావు, డీవీ ఆర్, పల్లా నరసింగరావు, నెహ్రూ, సిమ్మునాయుడు, దేవరపల్లి సత్య, పుల్లేటి వెంకటేశ్, గూనూరు రాజు పాల్గొన్నారు.

రచయిత శ్రీనివాసరావుకు తెలుగు భాషా పురస్కారం



చోడవరం, ఆగస్టు 29 (ఆంధ్ర జ్యోతి): రచయిత చింతకింది శ్రీనివాస రావుకు తెలుగు భాషా పితామహుడు గిడుగు రామమూర్తి పంతులు రాష్ట్ర తెలుగు భాషా పురస్కారం దక్కింది. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించే తెలుగుబాషా దినోత్సవంలో శ్రీనివాసరావుకు అవార్డును అందించనున్నారు. కళింగాంధ్ర మాండలికంలో కథలు, నవలలు రాసిన చింతకింది, నాటకాలు సినిమాలకు కూడా కథలు అందించడం విశేషం. ఉత్తరాంధ్ర ప్రాంతానికి చెందిన మాండలికంలో దాలప్పతీర్థం, కప్పస్తంభం, కాన్పుల దిబ్బ, తదితర కథా సంపుటాలు ఈయన కలం నుంచి జాలువారినవే. కథా రచనలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వ నంది అవార్డుతో పాటు ఉగాది పురస్కారం, చాసో, రావిశాస్త్రి పురస్కారాలు శ్రీనివాసరావు అందుకున్నారు. శ్రీనివాసరావు అవార్డుకు ఎంపిక కావడంపై స్థానిక ప్రముఖులు, అభిమానులు హర్షం వ్యక్తం చేశారు.

గెస్ట్ ఫ్యాకల్టీ నియామకాలకు దరఖాస్తుల ఆహ్వానం

నర్సీపట్నం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ అప్లికేషన్స్, ఆంగ్ల భాష బోధించడానికి గెస్ట్ ఫ్యాకల్టీ నియామకాలు చేపడుతున్నామని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్ బోధించడానికి ఎమ్మెస్సీ కంప్యూటర్ సైన్స్‌లో 55 శాతం మార్కులతో ఉత్తీర్ణ సాధించిన వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అలాగే నెట్, ఏపీసెట్, పీహెచ్‌డీ ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందన్నారు. ఆంగ్ల భాష బోధించడానికి ఎంఏ ఇంగ్లీషులో 55 శాతం మార్కులతో పాటు నెట్, ఏపీసెట్, పీహెచ్‌డీ ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. వచ్చే నెల 3వ తేదీన ఉదయం 10 గంటలకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూకు హాజరు కావాలని ఆయన తెలిపారు.

ఎరువుల కొరతతో రైతుల ఇక్కట్లు

నాతవరం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతు సేవా కేంద్రాల్లో ఎరువులు తగినంత దొరకకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం వివిధ గ్రామాల్లో వరి నాట్లు వేసేందుకు రైతులు దమ్ములు పడుతున్నారు. దమ్ములో డీఏపీ ఎరువు వేయడం కోసం రైతు సేవా కేంద్రాలకు వెళ్తున్నా లభ్యం కావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతు సేవా కేంద్రాల్లో యూరియా మాత్రమే ఇస్తున్నారని, ప్రస్తుత పరిస్థితుల్లో యూరియా కంటే డీఏపీ చాలా అవసరమని వారు చెబుతున్నారు. అలాగే ప్రైవేటు దుకాణంలో ఎన్ని ఎకరాల భూమి ఉన్నా ఒక్క డీఏపీ బస్తా మాత్రమే ఇస్తున్నారని, ఇది ఏమాత్రం సరిపోవడం లేదని రైతులు వాపోయారు. ఇప్పటికైనా వ్యవసాయాధికారులు స్పందించి మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో డీఏపీ అందుబాటులో ఉంచాలని వారు విజ్ఞప్తి చేశారు.

జెడ్.గంగవరం రోడ్డుకు రూ.60 లక్షల మంజూరు

మాకవరపాలెం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జెడ్.గంగవరం రోడ్డుకు రూ.60 లక్షలు మంజూరయ్యాయని ప్రాజెక్టు డీఈ ఆర్ఆర్‌వీ సత్యనారాయణ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ తాళ్లపాలెం మెయిన్ రోడ్డు నుంచి జెడ్.గంగవరం వరకు సుమారు నాలుగు కిలోమీటర్ల వరకు కొత్త రోడ్డు నిర్మాణం చేపడుతున్నట్టు చెప్పారు. త్వరలోనే ఈ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తామని, అనంతరం పనులు ప్రారంభించి నిర్ణీత కాలంలోనే పూర్తిచేస్తామని ఆయన తెలిపారు. కాగా, ఈ రోడ్డుకు నిధులు మంజూరు కావడంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రోలుగుంట, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని నర్సీపట్నం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అప్పారావు ఓ ప్రకటనలో తెలిపారు. రోలుగుంట 11కేవీ ఫీడర్‌లో మరమ్మతుల కారణంగా ఉదయం 10 గంటల మధ్యాహ్నం 2 గంటల వరకు రోలుగుంట, కొమరవోలు, కొంతలం, కె.నాయుడుపాలెం, చెట్టుపల్లి, కొవ్వూరు గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని కోరారు.

గ్రామాల్లో డ్రోన్ నిఘా

నర్సీపట్నం రూరల్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏటిగైరంపేట, రావాణాపల్లి, గబ్బాడ, నెల్లిమెట్ల గ్రామాల్లో డ్రోన్ కెమెరాతో పర్యవేక్షించామని రూరల్ సీఐ రేవతమ్మ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా బహిరంగంగా మద్యం సేవిస్తున్న ముగ్గురిని అదుపులోకి తీసుకున్నామన్నారు. డౌనూరు సమీపంలో డ్రోన్ సహాయంతో గంజాయి రవాణా నివారణకు తనిఖీలు చేసినట్టు ఆమె తెలిపారు.

దేవరాపల్లిలో అన్నసమారాధన

దేవరాపల్లి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శుక్రవారం అన్న సమారాధన నిర్వహించారు. మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఎం.అలమండలో పోతలనాయుడు రామాలయం, గవరవీధి, గొర్లివారి వీధిలో వినాయకుడి మండపాల వద్ద కూడా అన్నసమారాధనలు ఏర్పాటు చేశారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

బుచ్చెయ్యపేట, ఆగస్టు 29 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని పి.భీమవరం గ్రామానికి చెందిన పినపోలు కామేశ్ శుక్రవారం గడ్డి మందు తాగి ఆత్మాహత్యాయత్నానికి పాల్పడ్డాడు. పోలీసులు, బంధవుల కథనం ప్రకారం.. ఓ వివాహితతో కామేశ్ ప్రేమాయణం సాగించాడు. ఇటీవల ఇద్దరు ఇంటి నుంచి వెళ్లి పోయారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు వారిని వెతికి తీసుకువచ్చి, గ్రామ పెద్దల సమక్షంలో పంచాయితీ పెట్టారు. అయినప్పటికీ ప్రేమ వ్యవహారం విఫలమైందని మనస్థాపం చెంది కామేశ్ గడ్డి మందు తాగేశాడు. కుటుంబ సభ్యులు వైద్యం కోసం ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్నాడు.

క్రికెట్ బ్యాట్‌తో దాడి

బుచ్చెయ్యపేట: మండలంలోని ఎల్.సింగవరం గ్రామంలో క్రికెట్ బ్యాట్‌తో ఓ వ్యక్తి దాడి చేశాడు. గ్రామానికి చెందిన అన్నదమ్ములు రేణం నాగరాజు, రాము మధ్య భూ తగాదాలు ఉన్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం వీరికి గొడవ జరిగింది. దీంతో నాగరాజు కుమారుడు హేమంత్ తన చిన్నాన్న రామును క్రికెట్ బ్యాట్‌తో తలపై కొట్టాడు. రామును అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రిలో చేర్చగా, పరిస్థితి విషమంగా ఉండడంతో విశాఖపట్నం తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా చంద్రబాబు పర్యటన




డబుల్ డెక్కర్ బస్సు ఎక్కే ముందు సీఎం చంద్రబాబునాయుడుకు బ్యాడ్జి పెడుతున్న జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్.. పక్కన టికెట్ కొనుగోలు చేస్తున్న ముఖ్యమంత్రి. చిత్రంలో ఎంపీ శ్రీభరత్ ఉన్నారు



డబుల్ డెక్కర్ బస్సులో కలెక్టర్ హరేంధిరప్రసాద్, ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణబాబు, తదితరులు



నోవాటెల్ హోటల్‌లో ఇండియా ఫుడ్ మాన్యుఫ్యాక్చరింగ్ సదస్సుకు హాజరైన చంద్రబాబుకు నమస్కరిస్తున్న ప్రముఖులు



డబుల్ డెక్కర్ బస్సుల ప్రారంభోత్సవంలో ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

విశాఖపట్నం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నగర పర్యటన శుక్రవారం ఆద్యంతం ఉల్లాసంగా.. ఉత్సాహంగా సాగింది. ఇందులో భాగంగా చంద్రబాబు తొలుత హోటల్ నోవాటెల్‌లో ఇండియా ఫుడ్ మ్యానుఫ్యాక్చరింగ్ సదస్సులో పాల్గొన్నారు. అనంతరం ఆయన రాష్ట్ర పర్యాటక శాఖ-జీవీఎంసీ సంయుక్తంగా బీచ్ రోడ్డులో నడపనున్న రెండు డబుల్ డెక్కర్ (హాప్ ఆన్-హాప్ ఆఫ్) బస్సులను కాళీమాత ఆలయం వద్ద జెండా ఊపి ప్రారంభించారు. కాసేపు ఆ బస్సులో చంద్రబాబుతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు సరదాగా పర్యటించారు. ఆ తరువాత రాడిసన్ బ్లూ హోటల్‌లో జరిగిన గ్రిఫిన్ ఫౌండర్ నెట్‌వర్క్ మీటింగ్‌లో చంద్రబాబు పాల్గొన్నారు.



హోటల్ నోవాటెల్‌లో సీఎం చంద్రబాబుతో మాట్లాడుతున్న చిరంజీవి చౌదరి

ముఖ్యమంత్రికి ఆత్మీయ వీడ్కోలు

గోపాలపట్నం: నగర పర్యటనను ముగించుకున్నాక సీఎం చంద్రబాబు సాయంత్రం 4.30 గంటలకు విమానాశ్రయానికి రోడ్డు మార్గం గుండా చేరుకున్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా శ్రీబాలవీరాంజేయస్వామి, హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు పి.గణబాబు, బండారు సత్యనారాయణమూర్తి, పి.విష్ణుకుమార్‌రాజు, మేయర్ పీలా శ్రీనివాసరావు, కలెక్టర్ హరేంధిరప్రసాద్, సీపీ శంఖబ్రత బాగ్చి, వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్, డీసీపీ మేరీ ప్రశాంతి, ఆర్డీవో పి.శ్రీలేఖ, తదితరులు ముఖ్యమంత్రికి ఆత్మీయ వీడ్కోలు పలికారు. అనంతరం చంద్రబాబు 4.53 గంటలకు ప్రత్యేక విమానంలో బెంగళూరు బయలుదేరి వెళ్లారు.

విశాఖలో పవన్‌కల్యాణ్



రుషికొండ భవన పరిశీలనకు వెళుతున్న డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి నాదేండ్ల మనోహర్, తదితరులు



ఊడిపడిన ఫాల్స్ సీలింగ్‌ను పరిశీలిస్తున్న పవన్ కల్యాణ్. చిత్రంలో మంత్రి మనోహర్ ఉన్నారు



రుషికొండ ప్యాలెస్‌లోని ఒక రూమ్‌ను తిలకిస్తున్న పవన్‌కల్యాణ్



రుషికొండ భవనంలో సమావేశమైన పవన్‌కల్యాణ్, మంత్రులు నాదేండ్ల మనోహర్, కందుల దుర్గేష్, ఎమ్మెల్యేలు కొణతాల రామకృష్ణ, వంశీకృష్ణ శ్రీనివాస్, పంచకర్ల రమేశ్‌బాబు, ఇతర ప్రముఖులు



మంత్రి నారా లోకేశ్‌కు చిత్రపటాన్ని బహూకరిస్తున్న ఐసీఏఐ ప్రతినిధులు



చంద్రంపాలెం పాఠశాలలో లోకేశ్‌తో అభిమానుల కరచాలనం



ఏరో స్పేస్ మాన్యుఫాక్చరింగ్ సదసులో కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర మంత్రులు లోకేశ్, కొండపల్లి శ్రీనివాస్

సకాలంలో స్థానిక ఎన్నికలు

... 5వ పేజీ తరువాయి

నగర మేయర్ పీలా శ్రీనివాసరావు, తదితరులు పార్టీ కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా రెండో డిప్యూటీ మేయర్ ఎన్నిక విషయం ప్రస్తావనకు వచ్చింది. అవిశ్వాసం పెట్టి తన నియోజకవర్గంలో టీడీపీ కార్పొరేటర్‌కు అవకాశం ఇవ్వాలని ఒక ఎమ్మెల్యే కోరారు. ఈ నేపథ్యంలో జీవీఎంసీలో పూర్తి పట్టు ఉన్నప్పటికీ రెండో డిప్యూటీ మేయర్‌పై అవిశ్వాసం ఎందుకు పెట్టలేదని నేతలను ప్రశ్నించారు. దీనిపై ఓ ఎమ్మెల్యే మాట్లాడుతూ కౌన్సిల్ పదవీకాలం కొద్దినెలలు మాత్రమే ఉందని, ఇటువంటప్పుడు అవిశ్వాసం ఎందుకని అనడంతో మంత్రి లోకేశ్ ఆగ్రహం వ్యక్తంచేశారని తెలిసింది. ఆ సమయంలోనే స్థానిక సంస్థలకు సకాలంలో ఎన్నికలు నిర్వహిస్తామని మంత్రి చెప్పారు. ప్రభుత్వంలో ఇంకా మిగిలిన నామినేటెడ్ పదవులు పంపకం త్వరలో చేపడతామన్నారు. జీవీఎంసీ పరిధిలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులు వెంటనే పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. మంత్రి లోకేశ్ పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వెళ్లిన తరువాత ఇన్‌చార్జి మంత్రి నేతృత్వంలో సర్క్యూట్‌హౌస్‌లో ఎంపీ భరత్ తప్ప మిగిలిన వారంతా సమావేశమయ్యారు. రెండో డిప్యూటీ మేయర్‌పై అవిశ్వాసం, నామినేటెడ్ పదవుల పంపకం కోసం నివేదికలు తయారుచేయడం, నగరంలో ఇంటింటికీ 24 గంటల తాగునీరు, రోడ్లు, మురుగుకాల్వల నిర్మాణం, ఇతర పనులు వెంటనే పూర్తిచేసేలా జీవీఎంసీ అధికారులకు సూచించాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా నగర మేయర్‌కు పలు సూచనలు చేశారు.

మంత్రి లోకేశ్ ప్రజాదర్బార్

మంత్రి లోకేశ్ శుక్రవారం ఉదయం టీడీపీ కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. పలువురు ఇచ్చిన వినతులు పరిశీలించి ఆయా సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చారు. ఉత్తరాంధ్రలో వాడబలిజ మత్స్యకారులకు వలలు, బోట్లు ఇవ్వాలని, శిక్షణ కేంద్రాలు, పాఠశాలలు ఏర్పాటుచేయాలని సంబంధిత సంఘం ప్రతినిధులు కోరారు. రోడ్డు ప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన తనను ఆర్థికంగా ఆదుకోవాలని ఎలమంచిలికి చెందిన గుడాల జీవన్‌కుమార్, డిగ్రీ చదివిన దివ్యాంగురాలైన తన కుమార్తెకు ఉద్యోగం ఇచ్చి ఆదుకోవాలని విశాఖలోని 91వ వార్డుకు చెందిన ఆదినారాయణ కోరగా మంత్రి భరోసా ఇచ్చారు.

కొనసాగిన డీఎస్సీ అర్హుల సరిఫికెట్ల వెరిఫికేషన్

... 5వ పేజీ తరువాయి

సుమారు 600 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఉమ్మడి జిల్లాలో అన్ని కేటగిరీలు కలిపి 1,139 పోస్టులు, జోన్-1లో రెసిడెన్షియల్ స్కూళ్లలో పలు కేటగిరీలకు చెందిన పోస్టులు 307 కలిపి మొత్తం 1,446 పోస్టులకుగాను గురువారం 815 మంది సర్టిఫికెట్లు పరిశీలనకు హాజరయ్యారు. వీరిలో 48 మంది అభ్యర్థులు వివిధ కారణాలతో తగిన సర్టిఫికెట్లు తీసుకురాకపోవడంతో వారికి ఒక రోజు గడువిచ్చారు. వారిలో కొందరు సర్టిఫికెట్లతో శుక్రవారం హాజరయ్యారు. ఇప్పటి వరకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు హాజరుకాని అభ్యర్థులు, పలు కారణాలతో సర్టిఫికెట్లు తీసుకురాని వారంతా విధిగా శనివారం విమల విద్యాలయానికి హాజరుకావాలని డీఈవో ఎన్.ప్రేమ్‌కుమార్ తెలిపారు.

ఇన్‌చార్జిల పాలనలో దేవదాయ శాఖ

... 5వ పేజీ తరువాయి

ఒక ఈవో చూస్తున్నారు. అనకాపల్లి గ్రూపు దేవాలయాల ఈఓ.. నక్కపల్లి గ్రూపు దేవాలయాలను కూడా పర్యవేక్షించాల్సి వస్తున్నది. మునగపాక, ఎలమంచిలి, రాంబిల్లి, నర్సీపట్నం గ్రూపు దేవాలయాల పర్యవేక్షణను ఎలమంచిలి ఈవో చూస్తున్నారు. రావికమతం, వడ్డాది, మాడుగులకు చెందిన గ్రూపు దేవాలయాల బాధ్యతలు చోడవరం ఈవో అదనంగా నిర్వహిస్తున్నారు. కాగా ఈవో కార్యాలయాలకు 13 మంది గుమస్తాలు, 13 మంది ఆఫీస్ సబార్డినేట్‌లు వుండాలి. కానీ అనకాపల్లి, నర్సీపట్నం, చోడవరం ఈవో కార్యాలయాల్లో గుమస్తాలు మాత్రమే వున్నారు. ఒక్కచోట కూడా ఆఫీస్ సబార్డినేట్ లేరు. మొత్తం మీద 13 ఆఫీస్ సబార్డినేట్ పోస్టులు, 10 గుమస్తా పోస్టులు రెండేళ్ల నుంచి ఖాళీగా ఉన్నాయి.

అపార్ట్‌మెంట్ ఫ్లాట్‌లో జిల్లా కార్యాలయం!

జిల్లా దేవదాయ శాఖ సహాయ కమిషనర్ కార్యాలయాన్ని అనకాపల్లి రింగ్‌రోడ్డు జంక్షన్ సమీపంలోని ఒక అపార్టుమెంట్ రెండో అంతస్థులో ఏర్పాటు చేశారు. ఇక్కడ ఇద్దరు సీనియర్ అసిస్టెంట్‌లు, ఒక సూపరింటెండెంట్, టైపిస్టు, డేటా ఎంట్రీ ఆపరేటర్, ఇద్దరు ఆఫీస్ సబార్డినేట్‌లు వుండాలి. కానీ ప్రస్తుతం ఒక సీనియర్ అసిస్టెంట్, ఒక గుమస్తా మాత్రమే ఉన్నారు. సహాయ కమిషర్ కేఎల్ సుధారాణికి అల్లూరి సీతారామరాజు జిల్లా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఆమె వారంలో రెండు రోజులు ఆ జిల్లా వ్యవహారాల పర్యవేక్షణకు వెళుతున్నారు.

'స్త్రీ శక్తి'కి కొత్తగా మూడు వేల బస్సులు అవసరం

- పది వేల మంది సిబ్బందిని నియమించాలి
- ఏపీ పీటీడీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు దామోదరరావు



సమావేశంలో మాట్లాడుతున్న దామోదరరావు

అనకాపల్లి టౌన్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్త్రీ శక్తి పథకం విజయవంతంగా నడవాలంటే కొత్తగా మూడు వేల బస్సులు కొనుగోలు చేసి, పది వేల మంది సిబ్బందిని నియమించాలని ఏపీ పీటీడీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు అన్నారు. శుక్రవారం ఇక్కడ యూనియన్ జిల్లా అధ్యక్షుడు డీఎల్ రాజు అధ్యక్షతన జరిగిన జిల్లా సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ, విజయవాడలో లూలూ షాపింగ్‌మాల్‌కు ఆర్టీసీ స్థలాన్ని లీజుకు ఇస్తూ జారీ చేసిన జీవోను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 11వ పీఆర్సీ డీఏ బకాయిలు చెల్లించి ఐఆర్ ప్రకటించాలని, 12వ పీఆర్సీ వేయాలని కోరారు. గత ప్రభుత్వ హయాం నుంచి పెండింగ్‌లో ఉన్న పదోన్నతులకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వాలని కోరారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జీతాలను ఆప్కాస్‌లో చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో యూనియన్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి జి.నారాయణరావు, విజయనగరం జోన్ అధ్యక్షుడు కేజే సుభాకర్, జోనల్ కార్యదర్శి బి.కృష్ణమూర్తి, కోశాధికారి బి.తాతలు, జాయింట్ సెక్రటరీలు వై.రాము, యూఎస్ నారాయణ, పలువురు ప్రతినిధులు పాల్గొన్నారు.

ఈయూ జిల్లా కమిటీ ఎన్నిక

ఏపీ పీటీడీ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా నూతన కమిటీ ఎన్నిక జరిగింది. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వైవీఎస్ కుమార్, అధ్యక్షుడిగా డీఎస్ మూర్తి, జిల్లా కార్యదర్శిగా డీఎల్ రాజు, కోశాధికారిగా ఐఎస్ బాబు, మరో ఐదుగురు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

సీఎం చంద్రబాబుకు జిల్లా నేతల స్వాగతం



విశాఖలో చంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న హోం మంత్రి అనిత, ఎమ్మెల్యే బండారు, కార్పొరేషన్ల చైర్మన్లు బత్తుల తాతయ్యబాబు, పీలా గోవింద, మళ్ల సురేంద్ర

అనకాపల్లి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): విశాఖ పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శుక్రవారం జిల్లాకు చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. నేవీ కోస్టల్ హెలిప్యాడ్ వద్ద రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత, ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు, గృహ నిర్మాణ సంస్థ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు, ఏపీ అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర తదితరులు చంద్రబాబును కలిసి గులాబీ పూలను అందించి స్వాగతం పలికారు.

ప్రజల ఆకాంక్షలను గుర్తించండి

... 5వ పేజీ తరువాయి

వాటి కోసం పనిచేయాలని, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా నడుచుకోవాలని నాయకులకు సూచించారు. విశాఖపట్నం ఎప్పుడూ జనసేన పార్టీకి అండగా ఉందని, ఇక్కడి ప్రజలు తాము ఉన్నామనే భరోసా ఇచ్చారని పవన్ కల్యాణ్ అన్నారు. వైసీపీ ప్రభుత్వంలో జరిగిన ఘటనలను గుర్తు చేసుకున్నారు. జనవాణి కార్యక్రమం కోసం విశాఖపట్నం వస్తే నోవాటెల్ హోటల్‌లో పోలీసులు నిర్బంధించారని, బయటకు రానివ్వలేదని పేర్కొన్నారు. ఈ విషయం తెలిసి ఓ మహిళా అభిమాని చంటిబిడ్డను చంకలో ఎత్తుకొని వచ్చి, పార్టీకి అండగా నడిరోడ్డుపై నిలబడిందన్నారు. అదేవిధంగా అంతకుముందు 2019 ఎన్నికల్లో ఓడిపోయినప్పుడు తొలుత విశాఖపట్నం వస్తే వేలాది మంది అభిమానంతో వచ్చి స్వాగతం పలికారన్నారు. విశాఖతో జనసేన పార్టీ బంధం విడదీయరానిదన్నారు.

కూటమితో కలిసి ఉంటూనే పార్టీ బలోపేతం

కూటమితో కలిసి ఉంటూనే సొంతంగా జనసేన బలోపేతం అవుతుందని, దానికి పార్టీ అధినేత పవన్ కల్యాణ్ దిశా నిర్దేశం చేశారని ఆ పార్టీ ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ తెలిపారు. బీచ్‌రోడ్డులోని బే వ్యూ హోటల్‌లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పార్లమెంటు నియోజకవర్గాల నుంచి వచ్చిన కార్యకర్తలు, నాయకులతో పవన్ కల్యాణ్ మాట్లాడిన అంశాలను సుందరపు వెల్లడించారు. ఎక్కడి సమస్యలు అక్కడే పరిష్కారం అయ్యేలా నాయకత్వం అభివృద్ధి చెందాలని సూచించారన్నారు. రుషికొండ ప్యాలెస్‌పై త్వరగా ఒక నిర్ణయం తీసుకోవాలని సమావేశంలో తీర్మానం చేశామని, దానిని సీఎం చంద్రబాబునాయుడుకు అందజేస్తామన్నారు. రుషికొండ పెద్ద అంశం కాదని వైసీపీ నేతలు అంటున్నారంటే...వారికి ప్రజాధనం రూ.453 కోట్లు అంటే లెక్కలేదని అర్థం చేసుకోవాలన్నారు. ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో శనివారం జరిగేది బహిరంగ సభ కాదని, పార్టీ క్రియాశీల కార్యకర్తల సమావేశం అని, రాత్రి 7.30 గంటల వరకు జరుగుతుందన్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాల వారు కూడా వస్తున్నారన్నారు.

క్రైం... crime news

పురుగుల మందు తాగి ఆత్మహత్య

దేవరాపల్లి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగయ్యపేటకు చెందిన కొట్యాడ అచ్చిబాబు (38) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు ఎస్ఐ పి.సత్యనారాయణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మద్యానికి బానిసై భార్యతో గొడవ పడుతుండేవాడు. ఇంటిలో ఎవ్వరూ లేని సమయంలో పురుగుల మందు తాగాడు. దీంతో కుటుంబ సభ్యులు కె.కోటపాడు సీహెచ్‌సీకి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందాడు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

పంట కాలువలో పడి మహిళ మృతి

ఎలమంచిలి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తురంగలపాలెం సమీపంలో ప్రమాదవశాత్తూ పంట కాలువలో పడి మహిళ మృతిచెందింది. ఇందుకు సంబంధించి రూరల్ ఎస్ఐ ఉపేంద్ర తెలిపిన వివరాలిలా వున్నాయి. తురంగలపాలెం గ్రామానికి చెందిన నడిగట్ల రాము (50) అనే మహిళ, భర్త అప్పారావు కలిసి గురువారం ఉదయం పొలంలో పనులు చేయడానికి వెళ్లారు. సాయంత్రం పనులు పూర్తయిన తరువాత తొలుత అప్పారావు సైకిల్‌పై ఇంటికి వెళ్లిపోయాడు. తరువాతీ రాము ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులతో కలిసి గాలించారు. శుక్రవారం మధ్యాహ్నం తురంగలపాలెం సమీపంలోని పంట కాలువలో ఆమె విగతజీవిగా పడివుంది. శరీరంపై ఎటువంటి గాయాలు లేకపోవడంతో పొలం వస్తున్నప్పుడు పొరపాటున పంట కాలువలోకి జారిపడి మృతిచెంది ఉండవచ్చునని భావించారు. అప్పారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	108.00
లైవ్ ధర	128.00
విత్ స్కిన్	226.00
స్కిన్ లెస్	236.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554